

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
5★★★
ఆదివారం 2 మార్చి 2025



రంజాన్ మాసాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలి

వేములవాడ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : పవిత్రమైన రంజాన్ మాసాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలని వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ సూచించారు. రంజాన్ మాసం ప్రారంభం నేపథ్యంలో శనివారం నాడు ఆయన వేములవాడ పట్టణంలోని ముస్లిం పెద్దలతో సమావేశం అయ్యారు. ఈ కార్యక్రమంలో పట్టణ ముస్లిం కమిటీ అధ్యక్షుడు అక్రమ్, నాయకులు బాబున్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- 5 నుంచి 25 వరకు పరీక్షలు..
- జిల్లాలో 16 పరీక్ష కేంద్రాలు.. 9,310 మంది విద్యార్థులు..
- వంద మీటర్ల దూరం వరకు నిషేధాజ్ఞలు.. 163 సెక్షన్ అమలు
- ఈసారి వాచీలకు అనుమతి లేదు..
- నిమిషం ని'బంధన'ం.. సీసీ కెమెరాల నిఘా..



(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

ఇంటర్ పరీక్షల నిర్వహణకు సర్వం సిద్ధం చేశారు. జిల్లాలో ఉత్తీర్ణత శాతం పెంచే దిశగా అధ్యాపకులు 90 రోజుల యాక్షన్ ప్లాన్‌ను రూపొందించి ప్రత్యేక తరగతుల నిర్వహణతో విద్యార్థులను సమాయత్తంచేశారు. పరీక్షల నిర్వహణపై ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతికుమారి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సూచనలు చేశారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పరీక్షల నిర్వహణపై సమీక్ష నిర్వహించి పలు ఆదేశాలు జారీచేశారు. విధివిధానాలు పకడ్బందీగా అమలు చేసే దిశగా దిశానిర్దేశం చేశారు.

ఇంటర్ పరీక్షలకు సంబంధించిన సబ్జెక్ట్‌ల ప్రశ్న పత్రాలు మూడు సెట్లు పోలీస్ స్టేషన్లకు చేరుకున్నాయి. మార్చి 5 నుంచి 25 వరకు జరిగే పరీక్షల నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. ప్రతి పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాల నిఘాలో మాస్ కాపీయింగ్‌కు చెక్ పెట్టేలా చర్యలు తీసుకున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 163 సెక్షన్‌ను అమల్లో ఉంచనున్నారు. వంద మీటర్ల దూరం వరకు నిషేధాజ్ఞలు అమల్లో ఉంటాయి పరీక్ష సమ యంలో జిరాక్స్, కంప్యూటర్ కేంద్రాలను మూసివేసే విధంగా చర్యలు తీసుకున్నారు. వేసవి కాల దృష్ట్యా పరీక్ష కేంద్రాల వద్ద వైద్య సిబ్బంది, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, తాగునీటి సౌకర్యం వంటివి కల్పిస్తున్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో ప్రశ్నపత్రాల బాక్స్‌లు తెరవడం నుంచి సమాధాన పత్రాల ప్యాకెట్లు సీల్ చేసి పంపించే వరకు పకడ్బందీగా చర్యలు చేపట్టనున్నారు.

పరీక్షల నిర్వహణకు 300 మంది సిబ్బంది

జిల్లాలో ఇంటర్ పరీక్షల నిర్వహణకు 300 మందిని నియమించారు. ఒక్కో పరీక్ష కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్‌లుగా 16 మంది, అదనపు డిపార్ట్‌మెంటల్ అధికారులుగా 16 మంది, మరో 5 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, ఇద్దరు సిట్టింగ్ స్క్వాడ్, రెవెన్యూ, పోలీస్, విద్యాశాఖ నుంచి ముగ్గురు సభ్యులతో ఫ్లయింగ్ స్క్వాడ్, ముగ్గురు కస్టోడియన్స్‌ను నియమించారు. పరీక్ష పత్రాలు సీసీ కెమెరాల ముందే తెరవనున్నారు. ప్రతి 25 మంది విద్యార్థులకు ఒక ఇన్విజిలేటర్‌ను నియమించారు. 250 మంది ఇన్విజిలేటర్లుగా విధులు నిర్వర్తించనున్నారు. పరీక్ష కేంద్రాలకు హాజరయ్యే విద్యార్థులు నిబంధనలు ఖచ్చితంగా పాటించాల్సి ఉంటుంది. పరీక్ష గదుల్లోకి సెల్‌ఫోన్‌లు ఇతర ఎలక్ట్రికల్ వస్తువులకు అనుమతి లేదు. విద్యార్థులు ముందుగానే హాల్ టికెట్లలో పొరపాట్లు ఉంటే చూసుకోవాలని కోరుతున్నారు. ఫొటోలు, సబ్జెక్ట్‌లు, సంతకం వంటివి సరిగా ఉన్నాయా లేదా సరిచూసుకోవాలని కోరుతున్నారు. ఈసారి వాచీలను కూడా అనుమతించరు. గతంలో సాధారణ చేతి గడియారాలు ధరించే వీలు ఉండేది. ఈసారి అనుమతించరాదని నిర్ణయించారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు సమయాన్ని గుర్తుచేసేలా అరగంటలకు ఒకసారి బెల్ మోగిస్తారు. ఇన్విజిలేటర్లు కూడా గుర్తుచేసేలా చర్యలు తీసుకోనున్నారు.

గత విద్యా సంవత్సరంలో 16వ స్థానం..

గత 2023-2024 విద్యా సంవత్సరంలో ఇంటర్ ఫలితాల్లో

మిగతా 8వ పేజీలో..

జిల్లాలో 9310 మంది విద్యార్థులు...

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 16 కేంద్రాల ద్వారా ఇంటర్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందులో ఐదు ప్రైవేటు కాలేజీల్లో కేంద్రాలు ఉన్నాయి. ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. ఉదయం 8.10 గంటల నుంచే విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారు. నిర్ణీత సమయం కంటే ముందుగానే పరీక్ష రాయడం పూర్తి చేసినా పరీక్ష సమయం ముగిసిన తర్వాతనే బయటకు పంపిస్తారు. ఒక నిముషం ఆలస్యమైనా అనుమతించరు. ఇతర గ్రామాల నుంచి పరీక్షలకు వచ్చే విద్యార్థుల కోసం బస్ సౌకర్యాన్ని కల్పించను న్నారు. జిల్లా వ్యాప్తంగా పరీక్షలకు 9,310 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఇందులో మొదటి సంవత్సరం విద్యార్థులు 5,065 మంది, రెండో సంవ త్సరం విద్యార్థులు 4,245 మంది ఉన్నారు.

జిల్లాలో బాలికలే భేష్...

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇంటర్ ఫలితాల్లో ప్రతి సంవత్సరం బాలికలే భేష్ అనిపించుకుంటున్నారు. గత విద్యా సంవత్సరం ఫలితాల్లో మొదటి, రెండవ సంవత్సరం ఫలితాల్లో 6,722 మంది విద్యార్థులకు 4,130 మంది ఉత్తీర్ణులయ్యారు. 2,592 మంది ఫెయి లయ్యారు. బాలురు 1,195 మంది, బాలికలు 2,935 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో అధికంగా బాలికలు 1,740 మంది ఉన్నారు. మొదటి సంవత్సరం ఫలితాల్లో 3,542 మంది విద్యార్థులకు 2,047 మంది ఉత్తీర్ణులయ్యారు. 1,495 మంది ఫెయిలయ్యారు. 57.79 శాతం ఉత్తీర్ణత సాధించారు. బాలురులో 1,331 మంది పరీక్షలకు హాజరుకాగా 599 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 2,211 మంది హాజరు కాగా 1,448 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలుర కంటే 849 మంది బాలికలే అధికంగా ఉన్నారు. రెండవ సంవత్సరంలో 3,180 మంది పరీక్షలకు హాజరుకాగా 2,083 మంది ఉత్తీర్ణులయ్యారు. 65.5 శాతంగా ఉండగా 1,097 మంది ఫెయిలయ్యారు. బాలురు 1,154 మంది హాజరుకాగా 596 మంది ఉత్తీర్ణుల య్యారు. బాలికలు 2,026 మంది హాజరుకాగా 1,487 మంది ఉత్తీర్ణులయ్యారు. 891 మంది బాలికలు అధికంగా ఉన్నారు.

అల్లాడుతున్న అన్నదాతలు..

- అడుగంటిన భూగర్భ జలాలు
- అందని సాగునీరు
- పంటలను కాపాడాలని రైతుల వేడుకోలు



బొప్పాపూర్‌లో ధారగా పోస్తున్న వ్యవసాయ బోరు

7



గంభీరావుపేటలోని దుకాణాల సముదాయం..

దుకాణాల సముదాయం వినియోగంలోకి వచ్చేదెప్పుడో?

- టెండర్ ప్రక్రియ పూర్తయి ఏడాది..
- పట్టించుకోని అధికారులు

8

సైబర్ నేరాలతో జాగ్రత్తగా ఉండాలి..

- ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కొత్త నంబర్ల నుంచి వచ్చే కాల్స్, లింక్స్, మెసేజ్‌లపై అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలీసు యూనిఫాంతో ఎవరైనా వీడియో కాల్స్ చేసి డిజిటల్ అరెస్ట్ అంటే స్పందించవద్దన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తతే ఆయుధమన్నారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1930కి కాల్‌చేసి చెప్పాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తుల తియ్యని మాటల వలలో పడి వ్యక్తిగత విషయాలు, ఫొటోలు తీయవద్దన్నారు. వ్యక్తిగత విషయాల్లో ఎట్టి పరిస్థితుల్లో ఏమరుపాటుగా ఉండవద్దన్నారు. సోషల్ మీడియా అకౌంట్స్‌కి తప్పనిసరిగా ప్రొఫైల్ లాక్ పెట్టుకోవాలన్నారు. సోషల్ మీడియా వేదికగా వేధిస్తే తక్షణమే పోలీస్ వారిని సంప్రదించాలన్నారు. లోన్ యాప్‌లకు దూరంగా ఉండాలన్నారు. కస్టమర్‌కేర్ నంబర్‌లను గూగుల్‌లో వెతకవద్దని పేర్కొన్నారు. లాటరీ ఆఫర్లు, వెబ్‌సైట్స్ ప్రకటనలు, ఓఎల్ఎక్స్ ఇతర యాప్స్‌ను నమ్మవద్దన్నారు. జిల్లాలో వారం రోజుల వ్యవధిలో జరిగిన సైబర్ నేరాలను పరిశీలిస్తే చందుర్తిలో ఓ బాధితుడు వాట్సాప్‌లో వచ్చిన పార్ట్‌టైం జాబ్ అనే ప్రకటన చేసి కాంటాక్ట్ కావడంతో టాస్కల పేరుతో రూ.65వేలు పెట్టుబడి పెట్టి మోసపోయాడని పేర్కొన్నారు. ఇదే విధంగా సిరిసిల్లలో ఓ బాధితుడు క్రిప్టో కరెన్సీలో పెట్టుబడి పెట్టిస్తామని చెప్పి వాట్సాప్‌లో చాట్ చేయడంతో నమ్మి రూ.50వేలు పంపి మోసపోయాడని పేర్కొన్నారు. కోనరావుపేటలో ఓ బాధితుడు తన మొబైల్ పోగొట్టుకోవడం వల్ల తన మొబైల్ ఫోన్‌పే నుంచి రూ.2.15లక్షలు వేరే అకౌంట్‌లోకి పంపించుకున్నారన్నారు. ఇలాంటి సైబర్ నేరాల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, సైబర్ నేరాలకు గురైతే వెంటనే సంబంధిత ఫోన్‌కు కాల్‌చేసి చెప్పడమే కాకుండా వెబ్ పోర్టల్‌లో రిపోర్ట్ చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటారని ఆయన తెలిపారు.

టీకా కేంద్రాలను తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో



టీకా కేంద్రంలో తనిఖీ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌వో రజిత

సిరిసిల్ల టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణం సుందరయ్యనగర్ ఆరోగ్య కేంద్ర పరిధి బీవైనగర్, శివనగర్, ప్రగతినగర్‌లలోని వ్యాధి నిరోధక టీకా కేంద్రాలను శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్ రజిత ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లల వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో మిగిలిపోయిన పిల్లల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. పిల్లలకు టీకాలు ఇచ్చిన తరువాత రెండు గంటల వరకు అబ్జర్వేషన్లో ఉంచాలని సిబ్బందికి డాక్టర్ రజిత సూచించారు. పిల్లలకు టీకాలు వేసిన తర్వాత ప్రతికూల సంఘటనలు జరిగితే వెంటనే దగ్గర్లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి లేదా జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స కోసం పంపించాలని వివరించారు.

తొలగించిన చిత్రపటాలను ఏర్పాటుచేయాలి

- రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిల పక్షం నాయకులు

సిరిసిల్ల టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీ ముఖ్యమంత్రి కార్యాలయంలో తొలగించిన అంబేద్కర్, భగత్‌సింగ్ చిత్రపటాలను ఏర్పాటు చేయాలని అఖిలపక్షం నాయకులు డిమాండ్ చేశారు. ఢిల్లీలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి కార్యాలయంలో అంబేద్కర్, భగత్‌సింగ్‌ల చిత్రపటాలను తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ శనివారం సిరిసిల్ల సీపీఐ జిల్లా కార్యాలయంలో టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ కనకయ్య అధ్యక్షతన అఖిల పక్షం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. ఢిల్లీలోని బీజేపీ ప్రభుత్వం బీఆర్ అంబేద్కర్, భగత్‌సింగ్ చిత్రపటాలను అవహేళన చేస్తూ తొలగించి అవమానించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో బీజేపీకి పార్లమెంట్‌లో 400సీట్లు ఇస్తే భారత రాజ్యాంగానే మార్చామంటూ అమీత్‌షా బహిరంగంగా చెప్పడాన్ని దేశప్రజలు జీర్ణించుకోలేక గత ఎన్నికల్లో షాక్ ఇచ్చారని అన్నారు. ప్రపంచంలోని అగ్రదేశాలు బీఆర్ అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకుంటుండగా మన దేశంలో బీజేపీ ప్రభుత్వం అంబేద్కర్ మేధస్సుపైన విషం చిమ్ముతుందని ఆరోపించారు. బీజేపీ విధానాలను అఖిలపక్షం వ్యతిరేకిస్తుందని ఢిల్లీ ముఖ్యమంత్రి కార్యాలయంలో వెంటనే బీఆర్ అంబేద్కర్, భగత్‌సింగ్‌లో చిత్రపటాలను ఏర్పాటు చేయాలన్నారు. లేనిపక్షంలో మార్చి 7న సిరిసిల్లలోని మాజీ ముఖ్యమంత్రి దామోదర సంజీవయ్య విగ్రహం వద్ద ఉదయం 10 గంటలకు అఖిల పక్షం ఆధ్వర్యంలో కళ్ళకు నల్లగుడ్డలు కట్టుకొని నిరసన తెలుపుతామని, అనంతరం పట్టణ ప్రధాన రహదారల గుండా నిరసన ర్యాలీ నిర్వహిస్తామన్నారు. జిల్లాలోని అఖిలపక్షం నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు మేధావులు, అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, మాల మహానాడు జాతీయ కార్యదర్శి రాగుల రాములు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పంతం రవి, సోమ నాగరాజు, బుర్ర మల్లేశం గౌడ్, నాయకులు రవి, కొంపెల్లి విజయ్, శంకర్, ఆనంద్, రాములు, బాలయ్య, బాలమల్లు, వంకాయల భూమన్న పాల్గొన్నారు.

నేడు కేటీఆర్ పర్యటన

సిరిసిల్ల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల నియోజకవర్గంలో ఆదివారం మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ అధ్యక్షుడు కే తారకరామారావు పర్యటించనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు తంగళ్లపల్లి మండలం జిల్లెల్లలో జైలుకు వెళ్లి వచ్చిన రైతు రాజిరెడ్డిని పరామర్శిస్తారు. సిరిసిల్లలో ఇటీవల మున్సిపల్ అధికారులు తొలగించిన టీ కొట్టు నిర్వాహకుడు బత్తుల శ్రీనివాస్‌ను పరామర్శిస్తారు. అంకుసాపూర్, సిరిసిల్ల, ముస్తాబాద్‌లో పలు శుభకార్యాల్లో పాల్గొంటారు. ఇటీవల మృతి చెందిన బీఆర్ఎస్ నాయకులు బుర్ర శంకరయ్య, కాసర్ల మల్లేశం కుటుంబాలను పరామర్శిస్తారు. అనంతరం ఎల్లారెడ్డిపేటలో నీళ్లలేక ఎండిపోయిన పంటలను పరిశీలిస్తారు. పోత్గల్‌లో అప్పులబాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు దేవయ్య కుటుంబాన్ని పరామర్శిస్తారు.

ఎల్ఆర్ఎస్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): అనధికార లే అవుట్‌ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని ఈనెల 31వ తేదిలోగా 25 శాతంరాయితీ ఇస్తుందని, జిల్లాలోని అర్హులందరూ ఎల్ఆర్ఎస్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్ఆర్ఎస్ 2020కింద రాష్ట్ర వ్యాప్తంగా 25 లక్షల దరఖాస్తులు వచ్చాయని, గత సెప్టెంబర్‌లో జారీచేసిన మార్గదర్శకాల మేరకు కొన్ని దరఖాస్తుల క్రమబద్ధీకరణ జరిగిందని అన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు ఆమోదించే వాటికి 31వ తేది వరకు క్రమబద్ధీకరణ చేసుకుంటే చెల్లించాల్సిన రుసుములో 25 శాతం రాయితీ కలుగుతుందన్నారు. జిల్లాలో 42,942 దరఖాస్తులు స్వీకరించామని, అందులో 27,170 దరఖాస్తులు పరిశీలించామని, ఇంకా 15,772 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. 2020సంవత్సరంలో రూ.1000 కట్టిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రారంభం అయిందని తెలిపారు. 2020సంవత్సరంలో దరఖాస్తు చేసుకున్న వారు మున్సిపల్,సంబంధిత కార్యాలయాల్లో సంప్రదించి రెగ్యులరైజ్ చేసుకోవాలన్నారు. ఎల్ఆర్ఎస్‌పై అనుమానాలు, ఇబ్బందులు ఎదురైతే కలెక్టరేట్‌లోని టోల్ ఫ్రీ నంబర్ 18002331495కు సంప్రదించవచ్చని తెలిపారు. ప్రభుత్వ పనిదినాల్లో ఉదయం 10నుంచి సాయంత్రం 5వరకు సేవలందిస్తారన్నారు.

సర్టిఫికెట్స్ అందజేత

కోనరావుపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం నిజామాబాద్ ఉన్నత పాఠశాలలో చేతిరాత శిక్షణ పొందిన 30 మంది విద్యార్థులకు హెచ్ఎం షాబుద్దీన్ శనివారం సర్టిఫికెట్లను అందజేశారు.

ప్రేమాభిమానాల కలయిక.. రంజాన్

- ఖురాన్ అవతరించిన పవిత్ర మాసం - క్రమశిక్షణ, త్యాగం, ధాతృత్వం పెంచే రోజులు - నేటి నుంచి రోజా ప్రారంభం

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

ముస్లింలు పవిత్రంగా భావించే రంజాన్ మాసానికి వేళయింది. శనివారం రాత్రి నెలవంక దర్శనమివ్వడంతో ప్రత్యేక ప్రార్థనలు ముస్లింలు ప్రారంభించారు. ఆదివారం నుంచి నెల రోజు పాటు ఉపవాస దీక్షలు ముస్లింలు ఉంటారు. ఉపవాసాలతో పాటు ముస్లింలు పవిత్ర గ్రంథమైన ఖురాన్‌ను పఠిస్తారు. నమాజ్, జకాత్, ఫిత్రా వంటివి చేపడుతారు. క్రమశిక్షణ, ధార్మిక చింతన, ధాతృత్వం, త్యాగం, ప్రేమాభిమానాల కలిసిన రంజాన్ మాసంలో ముస్లింలు కఠోర ఉపవాస దీక్షలతో భక్తి శ్రద్ధలతో గడుపుతారు. పవిత్ర గ్రంథం ఖురాన్ రంజాన్ మాసంలో దైవ సందేశకులైన జిబ్రాయిల్, అలైసలామ్ ద్వారా ప్రవక్త మహ్మద్ సలాల్లాహు అలైహీ వసలమ్‌పై అవతరించింది. నిత్యం మహ్మద్ ప్రవక్త హితవుల ప్రకారం నడుచుకుంటారు.



నమాజ్ చేస్తున్న ముస్లింలు(ఫైల్)

ఉపవాస దీక్షలు..

ఖురాన్ ప్రకారం రంజాన్ మాసంలో ప్రతి ముస్లిం ఉపవాస దీక్షలు రోజాను పాటిస్తారు. ఉపవాస దీక్షలను పార్సీలో రోజా అంటారు. అరబ్బిలో సౌమ్ అని పిలుస్తారు. రంజాన్ మాసం ప్రారంభం నుంచి రోజా ఉపవాస దీక్షలను నిష్ఠగా పాటిస్తారు. కేవలం ఆహార పానీయాలు మానివేయడమే కాకుండా జీవన విధానంలో కూడా మార్పు ఉంటుంది. సూర్యోదయానికి ముందు భోజనం చేసి, మళ్లీ సూర్యాస్తమయం తరువాతే ఉపవాస దీక్షను విరమిస్తారు. తెల్లవారుజామున ఆహారం తీసుకోవడాన్ని షైహరీ అని, ఉపవాస దీక్ష విరమించడాన్ని ఇఫ్తార్ అని అంటారు. ఖర్జూరా పండుతో ముందుగా దీక్షను విరమిస్తారు. రంజాన్ మాసంలో దాదాపు 14గంటల పాటు ఉపవాస దీక్షలో ఉంటారు. దీక్ష పాటించే వారు అబద్ధం ఆడకుండా, ఇతరులను నిందించకుండా, శారీరక, మానసిక వాంఛలకు దూరంగా నిగ్రహంతో ఉంటూ దైవ చింతనతోనే గడుపుతారు. రంజాన్ మాసంలో దీక్షలను నెల రోజులు వయోజనులైన మహిళలు, పురుషులందరు విధిగా పాటిస్తారు. వృద్ధులు, పిల్లలు, వ్యాధిగ్రస్థులు, ప్రయాణంలో ఉన్నవారు వీటి నుంచి మినహాయింపు ఉంటుంది. వారు ఉపవాసాలను వేరే రోజుల్లో పూర్తి చేస్తారు. కేవలం ఉపవాస దీక్షలే కాకుండా మనిషిలోని చెడుభావాలు, అధర్మం, ఈర్ష్యద్వేశాలను రూపుమాపేవిధంగా దీక్షలు సాగుతాయి. పేదవారికి ఒకపూట అయినా ఆహారం పెట్టాలని ముస్లింలనమ్మకం.

ఏతేకాఫ్...

రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలతో పాటు రాత్రింబవళ్లు నమాజ్‌లో లీనమై ఉంటారు. సాధారణ రోజుల్లో ముస్లింలు ప్రతిరోజు ఐదుసార్లు నమాజ్ చేస్తే రంజాన్ మాసంలో 20 రకాల తరీహ్ నమాజ్ చేస్తారు. ఈమాసంలో 27వ రోజున షబ్-ఏ-ఖద్ర్ జరుపుకుంటారు. దివ్య ఖురాన్ ఈరోజు అవతరించిందని భావిస్తారు. ఆరోజు రాత్రి జాగరణచేస్తూ ప్రార్థన చేస్తారు. కఠోర దీక్షలతో ప్రార్థన చేస్తే 83 సంవత్సరాలు ప్రార్థన చేసిన పుణ్యఫలం దక్కుతుందని విశ్వసిస్తారు.

దివ్యాంగులకు యూడీఐడీ నంబర్ ఇవ్వాలి

- సదరం సర్టిఫికెట్ విధానానికి స్వస్తి - సెర్ఫ్ సీఈవో దివ్య దేవరాజన్ - కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్

సిరిసిల్ల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ప్రతి దివ్యాంగులకు యూడీఐడీ నంబర్‌ను జనరేట్ చేయాలని పంచాయతీరాజ్ కార్యదర్శి, సెర్ఫ్ సీఈవో దివ్య దేవరాజన్ అన్నారు. శనివారంహైదరాబాద్ నుంచి సదరం సర్టిఫికెట్ల నుంచి యూనిక్ డిజెబులిటీ ఐడీ జారీ, సోలార్ పవర్ ప్లాంట్లపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్ బదులు యూనిక్ డిజెబులిటీ ఐడీ జారీ చేయాల్సి ఉంటుందని సదరం సర్టిఫికెట్ నుంచి ఈ కార్డ్ జారీకి బదిలీ చేసేందుకు ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలు పాటించాలన్నారు. దివ్యాంగులకు వైద్యులు ధ్రువీకరించిన వైకల్య శాతంతో కూడిన సదరం సర్టిఫికెట్‌ను యూడీఐడీ పోర్టల్‌లో నమోదు చేయాలని, దివ్యాంగులకు సంబంధించి ఇతర వివరాలు సంపూర్ణంగా నమోదు చేయాలన్నారు. దివ్యాంగులకు కార్డు స్పీడ్ పోస్ట్ ద్వారా ఇంటి అడ్రస్‌కు వస్తుందన్నారు. నూతనంగా యూడీఐడీ కార్డుల కోసం మీసేవ దరఖాస్తు చేసుకోవచ్చని, సదరం సర్టిఫికెట్ ఉన్నవారు డీఆర్‌డీవో ద్వారా యూడీఐడీ జనరేట్ చేస్తారన్నారు. ఫిబ్రవరి 28వరకు జారీచేసిన సదరం సర్టిఫికెట్లతో పెన్షన్, ఇతర సదుపాయాలను తెలంగాణలో దివ్యాంగులు పొందవచ్చన్నారు. ఇతరరాష్ట్రాల్లో సౌకర్యాలు పొందాలంటే యూడీఐడీ కార్డు తప్పనిసరి అవుతుందని అన్నారు. మార్చి 1 నుంచి యూడీఐడీ జారీ చేస్తారన్నారు. వీటి ద్వారానే పెన్షన్ పొందాల్సి ఉంటుందన్నారు. జిల్లాలో ఉన్న మీసేవ కేంద్రాల నిర్వహకులు, పంచాయతీ కార్యదర్శులు, వీవోఏవోలు, సీసీలు, ఎంపీడీవోలు, ఏడీఎంలకు యూడీఐడీ దరఖాస్తుల నమోదుపై శిక్షణ అందించాలన్నారు. ఆసుపత్రుల్లో నిరార్ధరణ కోసం అవసరమైన వైద్యులు, పరికరాలు ఉండేలా చూడాలన్నారు. జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్‌తో సమన్వయం చేస్తూ ప్రస్తుతం అందుబాటులో ఉన్న వసతులను పరిశీలించి నూతన కావాల్సిన వస్తువుల ప్రతిపాదనలు అందజేయాలన్నారు. ప్రధానమంత్రి కుసుమ్ పథకం కింద సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు డీపీఆర్‌లను తయారుచేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కుసుమ్ పథకం వినియోగించుకొని రైతులు, మహిళ సంఘాల ద్వారా నడిపేలా చిన్నచిన్న సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌డీవో శేషాద్రి, డీడబ్ల్యూవో లక్ష్మీరాజం, అదనపు డీఆర్‌డీవో శ్రీనివాస్, డాక్టర్ పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

వివాహిత ఆత్మహత్య

- సూసైడ్ నోట్‌ను కొంగున కట్టుకుని బావిలో దూకిన యువతి
- వేధింపులే కారణమని తల్లిదండ్రుల ఆరోపణ


పల్లవి (ఫైల్)

వేములవాడ, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : అత్తింటి వారి వేధింపులు తట్టుకోలేక ఓ వివాహిత వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం చోటుచేసుకుంది. వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. వేములవాడరూరల్ మండలం అచ్చన్నపేట గ్రామానికి చెందిన కొక్కుల దేవరాజం కుమార్తె పల్లవి(23) వివాహం వేములవాడ పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన మ్యాన శివుడు అనే యువకుడితో 2021లో జరిగింది. పెళ్లి అయిన కొద్ది రోజులకే భర్తతోపాటు అత్త విజయ, కుటుంబ సభ్యులు అదనపు కట్నం కోసం వేధిస్తుండడంతో పలుమార్లు పంచాయతీలు జరిగాయి. అయినప్పటికీ వేధింపులు ఆగకపోవడంతో శనివారం తెల్లవారుజామున వేములవాడ పట్టణ శివారులోని చెక్కపల్లి రోడ్డులోగల ఓ వ్యవసాయ బావిలో దూకి పల్లవి ఆత్మహత్యకు పాల్పడింది. మృతదేహానికి ఉన్న చీర కొంగుకు పల్లవి రాసిపెట్టిన సూసైడ్ లేఖను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతురాలు తండ్రి దేవరాజం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వీరప్రసాద్ తెలిపారు.

మనస్థాపంతో ఒకరి బలవన్మరణం

బోయినపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కుల సంఘంలో తీసుకున్న చిట్టీ డబ్బులు సకాలం చెల్లించక మనస్థాపం చెందిన ఓవ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బోయినపల్లి మండలం మల్కాపూర్ గ్రామంలో శనివారం జరిగింది. ఎస్సై పృథ్వీధర్ గౌడ్ తెలిపినవివరాల ప్రకారం.. గ్రామానికిచెందిన పబ్బాల కొమురయ్య(55) కుల సంఘంలో 30వేల రూపాయల చిట్టీ డబ్బులు తీసుకున్నాడు. శనివారం కుల సంఘం సమావేశం ఉండడంతో తీసుకున్న డబ్బులను కొమురయ్య సకాలంలో చెల్లించే మార్గం కనిపించకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై వ్యవసాయ పొలం వద్ద ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ట్రాక్టర్ కిందపడి ఒకరి దుర్మరణం


ప్రశాంత్ (ఫైల్)

జమ్మికుంట, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని విలాసాగర్ గ్రామానికి చెందిన ఐలవేణి ప్రశాంత్(32) ట్రాక్టర్ అదుపుతప్పి కెనాల్‌లో పడి శనివారం మృత్యువాతపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రశాంత్ తనసొంత ట్రాక్టర్‌పై పనుల నిమిత్తం జమ్మికుంటకు వస్తున్నాడు. మార్గమధ్యలో ధర్మారం వద్దకు రాగానే ట్రాక్టర్ కుడిటైర్ పగిలి అదుపు తప్పి కెనాల్‌లో పడింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ ఇంజన్ భాగం ప్రశాంత్ మీద పడటంతో అక్కడికి అక్కడే మృత్యువాతపడ్డాడు. మృతుడి భార్య రమ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

చెరువులో పడి వృద్ధుడి మృతి

కరీంనగర్ క్రైం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కొత్తపల్లి చెరువులో పడి కొత్తపల్లికి చెందిన వృద్ధుడు రాపెల్లి రాజయ్య(88) మృతి చెందినట్లు కొత్తపల్లి పోలీసులు తెలిపారు. రాజయ్య శుక్రవారం బయటకు వెళ్లివస్తానని చెప్పి రాత్రి వరకు తిరిగి ఇంటికిరాలేదు. దీంతో ఆయన కొడుకు, బంధువులు రాజయ్య కోసం గాలిస్తూ కొత్తపల్లిలోని చెరువు వద్ద చూడగా అక్కడ అతని చెప్పులు, బట్టలు కనిపించాయి. అనుమానంతో చెరువులో గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. శనివారం ఉదయం గజఈతగాళలతో గాలించగా రాజయ్య మృతదేహం లభ్యమైంది. రాజయ్య బహిర్భూమికి వెళ్లి చెరువులో జారిపడి మృతి చెంది ఉంటాడని మృతుడి కొడుకు శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని కొత్తపల్లి పోలీసులు తెలిపారు.

తల్లి మందలించిందని.. యువకుడి ఆత్మహత్యాయత్నం

సుల్తానాబాద్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలం గట్టెపల్లి గ్రామానికిచెందిన హరీష్ అనేయువకుడు శనివారం మధ్యాహ్నం క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. హరీష్ తల్లి రూ.500 వేరే వాళ్ళకి ఇచ్చి రమ్మని పంపించగా హరీష్ ఆ డబ్బులను మిత్రులతో కలసి మద్యం కోసం ఖర్చు చేశాడు. మద్యం తాగి వచ్చిన కొడుకును తల్లి మందలించింది. బయటికి వెళ్లిన హరీష్ క్రిమి సంహారక మందు తాగాడు. అనంతరం ఇంటి సమీపంలోని వారి ఇంటికివెళ్ళగా గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు వెంటనే అతన్ని కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం హరీష్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

మూడు షిఫ్టుల్లో ఓట్ల లెక్కింపు

- జంబో బ్యాలెట్‌తో జాప్యం జరిగే అవకాశం
- పట్టభద్రుల ఓట్ల లెక్కింపునకు 21 టేబుళ్లు
- ఉపాధ్యాయుల నియోజకవర్గానికి 14 టేబుళ్లు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్లను లెక్కింపు కోసం జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. బ్యాలెట్ బాక్సులు భద్రపరిచిన కరీంగర్ అంబేద్కర్ స్టేడియంలోనే ఈ నెల 3న ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు. పట్టభద్రుల నియోజకవర్గంలో 2,50,328 మంది ఓటర్లు, ఉపాధ్యాయ నియోజక వర్గం లో 24,968 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పట్టభద్రుల నియోజక వర్గంలో 56 మంది అభ్యర్థులు పోటీలో ఉండ డంతో జంబో బ్యాలెట్ ఏర్పాటు చేశారు. దీంతో ఓట్ల లెక్కింపులో జాప్యం జరిగే అవకాశం ఉంది. కనీసం రెండు రోజులు ఓట్ల లెక్కి ంపు కొనసాగే అవ కాశం ఉండడంతో మూడు షిఫ్టుల్లో ఓట్ల లెక్కింపు నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు.



పకడ్బందీ ఏర్పాట్లు

ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చూసేందుకు పోలీసులు అంబేద్కర్ స్టేడి యం వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లను చేశారు. కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి పమేలా సత్పతి పర్యవేక్షణలో జిల్లా యంత్రాంగం ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను పూర్తి చేసింది. పట్టభద్రుల ఓట్ల లెక్కింపు కోసం 21 టేబుళ్లు, ఉపాధ్యాయుల ఓట్ల లెక్కింపు కోసం 14 టేబుళ్లు సిద్ధం చేశారు. ప్రతి టేబుల్ వద్ద ఒక మైక్రో అబ్జర్వర్, సూపర్‌వైజర్, ఇద్దరు కౌంటింగ్ అసిస్టెంట్లు విధులు నిర్వహించనున్నారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యే సరికి రెండు, మూడురోజులు పట్టే అవకాశమున్నందున మూడు షిఫ్టుల్లో ఓట్ల లెక్కింపు చేపట్టేందుకు సిబ్బందిని నియమించారు.

అంబేద్కర్ స్టేడియం వద్ద పటిష్ట భద్రత

ఓట్ల లెక్కింపు చేసే హాళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చూసేందుకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అంబేద్కర్ స్టేడియం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది. కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల పరిధిలోని 773 పోలింగ్ కేంద్రాల నుంచి తీసుకువచ్చిన బ్యాలెట్ బాక్సులను అంబేద్కర్ స్టేడియం స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరిచి, మూడంచెల భద్రతను ఏర్పాటు చేశారు. బ్యాలెట్ బాక్సులను ఉంచిన గదుల ముందు మొదటి దశలో కేంద్ర బలగాలను, రెండో దశలో ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ బలగాలను 89 మందిని మోహరించారు. స్టేడియం చుట్టూ సివిల్ పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. సీసీ టీవీ కెమెరాలను ఏర్పాటు చేసి పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేసి పర్యవేక్షిస్తున్నారు. స్టేడియం బయట ప్రధాన ద్వారా వద్ద భారీ ఎల్‌సీడీ స్క్రీన్ ఏర్పా టు చేశారు. ఈ స్ర్కీన్‌పై అభ్య ర్థులు బ్యాలెట్ బాక్సుల భద్ర తను పరిశీలించే వీలు కల్పించారు. ఓట్ల లెక్కింపు వద్ద శాంతిభద్రతలను పర్యవేక్షించేందుకు 400 మంది పోలీసు సిబ్బంది రెండు షిఫ్టుల్లో విధులు నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేశారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకరికి గాయాలు

శంకరపట్నం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొలంగూర్ ఎక్స్‌రోడ్‌లోని వీఎస్సార్‌గార్డెన్ సమీపంలో కుక్క అడ్డు రాగా ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడి ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపినవివరాల ప్రకారం.. సైదాపూర్ మండలం ఆరెపల్లిగ్రామానికి చెందిన గుంటి అయిలయ్య వ్యక్తిగత పనినిమిత్తం మండలంలోని కొత్తగట్టు గ్రామానికి వెళ్లి వస్తున్నాడు. మొలంగూర్ క్రాస్‌రోడ్‌లోని వీఎస్సార్‌గార్డెన్ సమీపంలో కుక్కలు పోట్లాడుకుంటున్నాయి. అయిలయ్య తన ద్విచక్ర వాహనం(టీవీఎస్ ఎక్సెల్)పై వస్తుండగా ఒకకుక్క అడ్డురాగా అదుపుతప్పి కిందపడ్డాడు. దీంతోకుడిచేయి విరిగింది. గమనించిన స్థానికులు108లో కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ప్రమాదవశాత్తు యువకుడికి..

ఇల్లందకుంట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని రైస్‌మిల్ సమీపంలో బైక్‌పై వెళ్తున్న యువకుడు ప్రమాదవశాత్తు కారు ఢీకొని తీవ్రగాయాలపాలయ్యాడు. మండల కేంద్రానికి చెందిన శనిగరపు రాజు బైక్‌పై వెళ్తున్నాడు. ఇదే క్రమంలో ఒకవ్యక్తి బైక్‌పై వస్తున్న రాజును గమనించక కారు ఆపి డోర్‌తీశాడు. అనంతరం బైక్ కారుడోర్‌ను ఢీకొట్టింది. దీంతో రాజు తలకు తీవ్రగాయాల య్యాయి. వెంటనే స్థానికులు రాజును జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

ఒకటి అంకెను మూడు రకాలుగా పరిగణలోకి తీసుకోవాలి

- ఎన్నికల కమిషన్, కరీంనగర్ ఆర్‌వోకు కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి రుద్ర సంతోష్ వినతి


రాష్ట్ర ఎన్నికల కమిషన్ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న రుద్ర సంతోష్

కరీంనగర్ అర్బన్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీకి జరిగిన పోలింగ్‌లో మొదటి ప్రాధాన్యత ఓటు విషయంలో ఒకటి అంకెను మూడురకాలుగా పరిగణించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి, టీపీసీసీ నేత రుద్ర సంతోష్ శనివారం రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు, జిల్లా ఎన్నికల అధికారికి విజ్ఞప్తిచేశారు. ఈ మేరకు ఒకటి అంకెను మూడు రకాలుగా వేసిన విధానాన్ని వివరిస్తూ ఆయన ఒక వినతిపత్రాన్ని వారికి అందజేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి ప్రాధాన్యతా ఓటు వేసేందుకు పట్టభద్రుల ఓటర్లు ఒకటి అంకెను మూడు రకాలుగా రాయవచ్చని. ఆ మూడు రకాల అంకెలను వివరిస్తూ, మూడు రకాలుగా ఒకటి అంకెను ఎవరు రాసినా దానిని పరిగణలోకి తీసుకోవాలని కోరారు.

నేడు శ్రీపాదరావు జయంతి

- ఉమ్మడి రాష్ట్రంలో అసెంబ్లీ స్పీకర్‌గా సేవలు
- అధికారికంగా నిర్వహణ



మంథని, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): శాసనసభ మాజీ స్పీకర్ దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి ఆదివారం జరగనుంది. శ్రీపాదరావు జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారంగా హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించనున్నారు. కాటారం మండలం ధన్వాడలో కమలాబాయి- రాధాకిష్టయ్యలకు మార్చి 2, 1937లో జన్మించారు. మంథని నియోజకవర్గం నుంచి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గెలుపొంది ఉమ్మడి రాష్ట్ర శాసన సభా స్పీకర్ స్థానాన్ని అలంకరించారు. స్వగ్రామమైన ధన్వాడ సర్పంచ్‌గా రాజకీయ ఆరంగేటం చేసిన ఆయన మహదేవపూర్ బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా, పొగాకు బోర్డు చైర్మన్‌గా, మంథని ఎల్ఎంటీ బ్యాంక్ చైర్మన్‌గా, డీసీసీలో, పీసీసీలో అనేక పదవులు నిర్వహించారు. 1983, 1985, 1989లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మంథని ఎంఎల్ఏగా గెలుపొందిన శ్రీపాదరావు ఉమ్మడి రాష్ట్ర శాసనసభా స్పీకర్‌గా నియమితులై 1994 వరకు కొనసాగారు. మంథని ప్రాంత అభివృద్ధి ప్రదాతగా ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. మహదేవపూర్ మండలం అన్నారం అటవీ ప్రాంతంలో శ్రీపాదరావును మావోయిస్టు 1999 ఏప్రిల్ 13న హత్య చేశారు. శ్రీపాదరావు భౌతికంగా దూరమై 24 యేళ్ల గడిచినప్పటికీ నేటికి ఇక్కడి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. నియోజకవర్గంలో శ్రీపాదరావు జయంతి నిర్వహణకు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, ట్రస్టు చైర్మన్ దుద్దిళ్ళ శ్రీనుబాబు సన్నాహాలు చేపట్టారు.

మడేలేశ్వర స్వామి ఆలయంలో చోరీ

ముస్తాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ముస్తాబాద్ మండల కేంద్రంలోని మడేలేశ్వర స్వామి ఆలయంలో చోరీ జరిగింది. ఇటీవల మడేలేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ముగిసిన క్రమంలో దొంగలుపడ్డారు. దాదాపు 8 వేల రూపాయలను హుండీలో నుంచి ఎత్తుకెళ్లినట్లు రజక సామజికవర్గం నాయకులు తెలిపారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గణేష్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

బీర్‌పూర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై బీర్‌పూర్ మండలం మంగేళ గ్రామానికి చెందిన గుర్రం శ్రీనివాస్(42) శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడని ఏఎస్సైరవీందర్ శనివారం తెలిపారు. శ్రీనివాస్ శుక్రవారం ఉదయం ఇంటినుంచి బయటకువెళ్లి ఇంటికి వచ్చి కింద పడిపోయాడు. తాను గడ్డిమందు తాగానని శ్రీనివాస్ కుటుంబసభ్యులకు తెలపడంతో భార్య లావణ్య ఆసుపత్రికి తీసుకువెళ్లి చికిత్సఅందిస్తుండగా శుక్రవారం సాయంత్రం మృతిచెందాడు. శ్రీనివాస్‌భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

అధిక వడ్డీకి అప్పు ఇస్తున్న వ్యక్తిపై కేసు

ఇల్లంతకుంట, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని రహీంఖాన్‌పేట గ్రామానికి చెందిన గడ్డమీది వెంకటేశంపై కేసు నమోదుచేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం వెంకటేశం గ్రామంలో అధిక వడ్డీలకు అప్పులు ఇస్తున్నాడనే సమాచారం మేరకు శనివారం ఇంటిలో సోదా చేశామన్నారు. ఇంటిలో ప్రామిసరీ నోట్స్, బాండ్‌లతోపాటు విలువైనపత్రాలు లభించినట్లుతెలిపారు. మండలంలోని ఏ గ్రామంలోనైనా అధిక వడ్డీలకు అప్పులు ఇచ్చినట్లయితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

ఐదుగురిపై కేసు నమోదు

జమ్మికుంటరూరల్, మార్చి1(ఆంధ్రజ్యోతి): అదనపు కట్నంకోసం తనఅత్తింటి వారు వేధిస్తున్నారని ఓవివాహిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు శనివారం ఐదు గురిపై కేసు నమోదుచేశారు. పోలీసులుతెలిపిన వివరాలప్రకారం.. జమ్మికుంట మండలం వావిలాల గ్రామానికిచెందిన ప్రనూషకు 2017లో మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట్‌కు చెందిన వెలగందుల రాజేష్‌తో పెద్దలసమక్షంలో వివాహం జరిగింది. వివాహం జరిగిన మూడు నెలలుపాటు కలిసిమెలిసిఉన్నారు. అనంతరం రాజేష్ మరొకమహిళతో వివాహేతర సంబం ధం ఏర్పరుచుకున్నాడు. అప్పటి నుంచి తన భర్తతోపాటు అత్తవిజయలక్ష్మి, మామ సత్యనారాయణ, ఆడపడుచు అరవపల్లి లావణ్య, ఆడపడచుభర్త కిషోర్ అదనపుకట్నం తేవాలని వేధిస్తున్నారని ప్రనూష పేర్కొంది. బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

ముందస్తు అడ్మిషన్లు చేస్తే కఠిన చర్యలు తీసుకోవాలి



బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి

భగత్‌నగర్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): విద్యా సంస్థల్లో ముందస్తు అడ్మిషన్లుచేస్తే కేసులు నమోదు చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి హెచ్చరించారు. శనివారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డిభవన్‌లో మాట్లాడుతూ రాష్ట్రంలో కొన్నివిద్యాసంస్థలు నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లు చేస్తున్నాయని ఆకళాశాలల్లో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో అడ్డుకుంటామన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ బకాయిలు విడుదల చేయాలన్నారు. అధికారుల వత్తాసు వల్లే విద్యాసంస్థల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. సమావేశంలో జిల్లాకార్యదర్శి మచ్చరమేష్, నగరకార్యదర్శి మామిడిపల్లి హేమంత్, సందీప్‌రెడ్డి, వినయ్, అశోక్ పాల్గొన్నారు.

అక్షర చిట్‌ఫండ్స్ మోసానికి ఏజెంట్ బలి

- ఎఫ్‌డీ, చిట్ డబ్బులు రాక ఆత్మహత్య
- న్యాయం చేయాలంటూ చిట్‌ఫండ్స్ బాధితుల ధర్నా


ఆందోళన చేస్తున్న అక్షర చిట్ ఫండ్స్ బాధితులు


రాజు (ఫైల్)

కరీంనగర్ క్రైం, మార్చి 1(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో అక్షర చిట్ ఫండ్స్ మోసానికి ఆసంస్థ ఏజెంట్ బలయ్యాడు. బాధిత కుటుంబ సభ్యులు, చిట్‌ఫండ్స్ బాధితులు, పోలీసులుతెలిపినవివరాల ప్రకారం... కరీంనగర్‌జిల్లా కొత్తపల్లి మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన చింతలరాజయ్య అలియాస్ రాజు (39) అక్షర చిట్‌ఫండ్స్‌లో కొన్నేళ్లుగా ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. రాజయ్య స్వంతంగా చిట్‌వేయటంతోపాటు బంధువులు, పరిచయస్తులతో చిట్స్ వేయించాడు. చిట్ డబ్బులు ఇవ్వకుండా తనకు రావాల్సిన 5లక్షల రూపాయలకు ఎక్కువ వడ్డీ చెల్లిస్తామని నమ్మబలికి చిట్‌సంస్థ ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించుకుంది.గడువుముగిసినా డబ్బులు అందకపోవడంతో రాజయ్య ఆర్థికంగా నష్టపోయాడు. 5లక్షల కోసం అక్షర చిట్‌ఫండ్స్ చుట్టూ రెండేళ్లుగా తిరిగాడు. మరోవైపు రాజయ్యద్వారా చిట్ వేసినవారికి కూడా ఆసంస్థ డబ్బులు చెల్లించకుండా మోసంచేసింది. ఈ విషయాన్ని తన భార్యకు తరచుగా చెబుతూ బాధపడేవాడు. ఇదే విషయాన్ని తలుచుకుంటూ మనోవేదనతో శుక్రవారం అర్ధ రాత్రి ఇంటివద్ద చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య వేకువజామున భర్తకోసం వెతకగా ఉరికి వేలాడుతూ కనిపించాడు. మృతుడికి భార్య, ఇద్దరు కొడుకులున్నారు. అక్షర చిట్‌ఫండ్స్ డబ్బులు చెల్లించక పోవటంతో ఆర్థికంగా నష్టపోయిన తన భర్త కుంగిపోయి ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి భార్యలావణ్య పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. రాజయ్య ఆత్మహత్య విషయం తెలుసుకున్న అక్షరచిట్‌ఫండ్స్ బాధితులు పెద్దఎత్తున కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని అక్షర చిట్‌ఫండ్స్ సంస్థపై చర్యలు తీసుకుని తమకు రావాల్సిన డబ్బులను ఇప్పించి న్యాయం చేయాలని ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా అక్షరచిట్‌ఫండ్స్ బాధితులు గంప జగన్, గెల్లు ఐలయ్య యాదవ్ తదితరులు మాట్లాడుతూ అక్షర చిట్‌ఫండ్స్‌సంస్థ చిట్‌గడువు ముగిసినప్పటికీ తమకు రావాల్సిన డబ్బులు చెల్లించకుండా ఒత్తిడితెచ్చిన వారికి ఖాళీ చెక్కులు ఇచ్చి రెండేళ్లయినా చెల్ల కుండా పోయాయన్నారు. ఈ క్రమంలోనే ఏజెంట్ చింతల రాజయ్య తన 5 లక్షల డిపాజిట్ డబ్బులు, చిట్ డబ్బుల కోసం ఎంత ప్రయత్నించినా రాకపోవటంతో మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డారని వాపోయారు.

ప్రజల సొమ్ముతో రియల్‌ఎస్టేట్ వ్యాపారం

అవసరాలకు ఉపయోగపడుతాయని ప్రతినెలా పొదుపు చేస్తూ అక్షర చిట్స్‌లో రిటైర్డ్‌ఉద్యోగులు, వికలాంగులు, వితంతువులు, చిరువ్యాపారులు చిట్‌వేసి బాధితులుగా మిగిలారు. మొదట చిట్ వేయించుకున్న అనంతరం వారికి డబ్బులు చెల్లించకుండా అధిక వడ్డీతో నమ్మబలికి అక్షర టౌన్‌షిప్ పేరిట ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించుకుని గడువు ముగిసినా డబ్బులు చెల్లించకుండా మోసం చేశారు. కాళ్లు అరిగేలా తిరిగినవారికి అక్షర టౌన్‌షిప్ పేరిట చెక్‌లు ఇవ్వగా అవికూడా చెల్లకుండా పోయాయి. చివరకు కొందరికి అక్షర టౌన్‌షిప్‌లో స్థలాలను 4 రెట్లకు లెక్కచేసి అంటగట్టారు. అక్షర చిట్‌ఫండ్స్ సంస్థకు తెలంగాణ వ్యాప్తంగా 65 బ్రాంచిలు ఉన్నాయి. ఒక్కో బ్రాంచిలో 50 నుంచి 60కోట్ల వరకు చిట్ సభ్యులకు బాకీ ఉన్నట్లు బాధితులు చెబుతున్నారు. కరీంనగర్‌పోలీస్‌కమిషనర్ ఆదేశాలతో కరీంనగర్ జిల్లాలోని రెండు చోట్ల 14కోట్ల రూపాయల ఆస్తులను ఇటీవల ప్రభుత్వం అటాచ్‌మెంట్‌కు ఆదేశాలు జారీచేసింది. వరంగల్, ఖమ్మం ఇతర చోట్ల ఉన్న ఆస్తులను కూడా ప్రభుత్వం స్వాధీనం చేసుకుని న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

పేలుళ్లతో దెబ్బతింటున్న పంటలు

- డి2 కాలువ నిర్మాణ పనులతో ఇబ్బందులు పడుతున్న రైతులు
- హద్దులు దాటి పొలాల్లోకి మట్టి
- ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు
- పట్టించుకోని అధికారులు


నాగిరెడ్డిపూర్‌లో లింక్2 కాలువ తవ్వకాలు
హద్దు దాటి పొలాల్లోకి వచ్చిన మట్టి

గంగాధర, మార్చి 1(ఆంధ్రజ్యోతి): మండలంలో నాగిరెడ్డిపూర్ డీ-2కాలువ నిర్మాణ పనుల్లో భాగంగా చేపడుతున్న పేలుళ్లతో సమీప పొలాల రైతులు భయాందోళనకు గురవుతున్నారు. కాలువలో బండ రాళ్లను పగులగొట్టేందుకు ఉపయోగిస్తున్న భారీ పేలు ల్లతో రాళ్లు ఎగిరిపడి సమీప పంటపొలాలు ధ్వంసమవుతున్నాయి. గంగాధర మండలం నాగిరెడ్డిపూర్ వరదకాలువ నుంచి రామడుగు మండలం దత్తోజిపేట మీదుగా చొప్పదండి వరకు లింకు2 కాలువ నిర్మిస్తున్నారు. కాలువలో తీసిన మట్టిని ఒడ్డుపై పోస్తున్నారు. కాలువకు భూములిచ్చిన హద్దులు దాటి మూడు మీటర్ల వరకు రైతుల పొలాల్లో మట్టిని పోస్తుండగా తీవ్రంగా నష్టపోతున్నామని బాధిత రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలువలో బండరాళ్ల పగుళ్లకు చేపట్టే పేలుళ్లతో రాళ్లు ఎగిరి వచ్చి పచ్చని పంటలు నాశనమవుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వరిపొలాలు పొట్ట దశలో ఉండగా రాళ్లు పడి కర్రలు విరిగి పోతున్నాయని రైతులు తెలిపారు. ఈ విషయంపై నీటి పారుదల శాఖ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. పేలుళ్లకు పొలాలకు నీరు పెట్టా లన్నా, ఎరువులు చల్లాలన్నా భయంగా ఉందని రైతులు వాపోతున్నారు. తమ బాధను ప్రశ్నిస్తే కాలువ తవ్వే వారు బెదిరిస్తున్నారని రైతులు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పేలుళ్ల దాటి నుంచి పొలాలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

రాళ్లు పడటంతో.. భూమిని బీడుగానే వదిలేశా..



\- పంజాల వేణు, రైతు, నాగిరెడ్డిపూర్

నాకు ఇక్కడ మూడెకరాల వ్యవసాయ భూమి ఉంది. నా భూమి మధ్య నుంచి కాలువ తవ్వుతున్నారు. బ్లాస్టింగ్‌తో రాళ్లు పడుతుండగా భూమిని దున్నకుండానే ఒకవైపు వదిలేశా. అటువైపు నీరున్న చోట పొలం వేయగా పేళుళ్ల దాటికి పంటపొలాల్లో రాళ్లు పడి కర్రలు విరిగిపోయి నష్టపోతున్నాం. అధికారులు పట్టించుకుని పొలాలను కాపాడాలి.

రైతులకు నష్టం జరగకుండా చూస్తాం..

\- రఘురాం, ఏఈ నీటిపారుదల శాఖ

నాగిరెడ్డిపూర్ డి2 కాలువ నిర్మాణంలో రైతులకు నష్టం జరగకుండా చూస్తాం. మట్టి పోస్తుండగా కొంతజారి పొలంలో పడుతుందని రైతులు నా దృష్టికి తీసువచ్చారు. పొలాల్లో పడిన మట్టిని తీసి వేయించి రైతులకు ఇబ్బంది కలుగకుండా చూస్తాం.

అల్లాడుతున్న అన్నదాతలు

పొలమంతా పగుళ్లు చూపింది




- భూక్యా మహేశ్, యువ రైతు, దేవునిగుట్టతండా

మాకున్న మూడెకరాల్లో రూ.60వేలు బాకీలు చేసి వరి పంట వేశా. ఉన్న ఒక్క బోరుతో మూడెకరాలు పారేది. ఇప్పుడు నీళ్లు అందడం లేవు. పది రోజుల నుంచి పంటంతా పగుళ్లు చూపుతోంది. మరో వారం రోజుల్లో సాగు నీరు పెడితే పంట చేతికొస్తది. ఇప్పటికైనా అధికారులు స్పందించి 9వ ప్యాకేజీ కాల్వ ద్వారా సాగు నీరు అందించి పంటలను కాపాడాలే. చేసిన అప్పులు తీర్చే మార్గం కానరావడం లేదు.

15 ఏళ్లయినా వరద కాలువ పనులు పూర్తి కాలేదు

-తల్ల నరేష్, ధర్మసమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్

నాడు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న కాలంలో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి చేపట్టిన వరద కాలువ పనులు నిలిచి పోయాయి. 15 సంవత్సరాలు గడిచినప్పటికీ పూర్తి కాలేదు. మండలంలోని అన్ని గ్రామాలకు పూర్తి స్థాయిలో సాగు నీరు అందక పంటలు ఎండిపోతున్నాయి. మామిడి తోటలకు కూడా నీరు అందడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం వరదకాలువ పనులు పూర్తి చేసి మండలంలోని అన్ని గ్రామాల రైతులకు సాగు నీరు అందేలా చూడాలి. లేదంటే పంటలపై పెట్టుబడులు పెట్టి రైతులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతారు.



చిగురుమామిడి మండలం బొమ్మనపల్లిలో ఎండిపోయిన వ్యవసాయ బోరు

ఎల్లారెడ్డిపేట మండలం దేవునిగుట్టతండాలో ఎండిపోయిన వరి పైరును మేస్తున్న పశువులు

పశువులకు మేతగా వదిలేశా..



- భూక్యా హుస్సేన్, రైతు, దేవునిగుట్టతండా

నాకున్న ఆరెకరాల్లో వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నా. గత రెండేళ్లలో రూ.4 లక్షల అప్పులు చేసి మూడు బోర్లు వేయించా. నీళ్లు మంచిగనే పడినయ్. బోర్లలో నీళ్లు ఉన్నాయని ఆరు ఎకరాల్లో రూ.1.20 లక్షల పెట్టుబడి పెట్టి వరి పంట వేశా. నెలకే బోర్లు ఎత్తేసినయ్. చిన్న ధారలా వస్తున్న నీళ్లతో తడులు పెడుతున్నా. మూడెకరాలకు సాగు నీరు అందక ఎండిపోయింది. పొలం ఎండిపోవడంతో పశువుల మేతకు వదిలేశా. బోర్లు, పంట పెట్టుబడికి రూ. 5.20 లక్షల దాకా బాకీల పాలయ్యా. ప్రభుత్వమే ఆదుకోవాలి.

ప్రభుత్వం ఆదుకోవాలి

- బొల్లోనిపల్లి ఎల్లవ్వ, రైతు, చిగురుమామిడి

బావుల్లో పూడిక తీయడానికి ప్రభుత్వం ఆదుకోవాలి. నాకున్న రెండు ఎకరాల భూమిలో వరి వేశాను. కనీసం ఇంకా నెలరోజులైనా నీళ్లు అవసరం ఉంది. సాగునీరు అందకపోవడంతో బావిలో పూడిక తీస్తున్నా. నీరులేక ఎండిన పంటలకు ప్రభుత్వం ఆర్థికసాయం అందించారు. కాలువ నీరు వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

ఎల్లారెడ్డిపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): వరిసాగు చేసిన రైతులకు ఆదిలోనే అరిగోస తప్పడం లేదు.

- అడుగంటిన భూగర్భ జలాలు..
- అందని సాగునీరు
- పంటలను కాపాడాలని రైతుల వేడుకోలు

భూగర్భ జలాలు అడుగంటడంతో ఎల్లారెడ్డిపేట మండలంలోని రాజన్నపేట, కిష్టునాయక్‌తండా, గుంటపల్లిచెరువుతండా, దేవునిగుట్టతండా తదితర గ్రామాల్లో పంటలు ఎండిపోతున్నాయి. పంటలకు సాగు నీరు అందించేందుకు ఇటీవల కోనరావుపేట మండలం మల్కపేట జలాశయం నుంచి 9వ ప్యాకేజీ కాల్వ ద్వారా నీటిని విడుదల చేసినా నాలుగు రోజులకే నిలిచిపోయింది. దాంతో ఆయా గ్రామాల్లోని సుమారు 2500ఎకరాల విస్తీర్ణంలో వరి పంటలు పగుళ్లు చూపాయి. మరో 2500 ఎకరాల్లో ఎండిపోయాయి. కళ్ల ముందే పంటలు ఎండిపోతుంటే కాపాడుకునేందుకు అన్నదాతలు పడరాని పాట్లు పడుతున్నారు. మండలంలోని గ్రామాల్లో నీటి వనరులు, వ్యవసాయ బోరుబావులపై ఆధారపడి సుమారు 4వేల మంది రైతులు మొత్తం 16,850 ఎకరాల విస్తీర్ణంలో వరి పంటను సాగు చేశారని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఎంతో ఆశతో సాగు చేసిన వరి పంటలకు సాగు నీరందకపోవడంతో ఆదిలోనే ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు గ్రామాల్లో సుమారు 2 వేల ఎకరాల విస్తీర్ణంలో వరి పంటలు పగుళ్లు చూపగా, మరో 2వేల ఎకరాల్లో ఎండిపోయాయి. మిగిలిన పంటలను రక్షించుకునేందుకు రేయింబవళ్లు పొలాలకు తడులు పెట్టాల్సి వస్తోందని వాపోతున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి 9వ ప్యాకేజీ కాల్వ ద్వారా సాగునీటిని అందించి పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

పశుగ్రాసంగా మారుతున్న పంటలు..

● **సాగునీరు అందక ఇబ్బందులు**

చిగురుమామిడి: మండలంలోని సుందరగిరి, బొమ్మనపల్లి, ఉల్లంపల్లి, కొండాపూర్, నవాబుపేట, చిగురుమామిడి, లంబాడిపల్లి తదితర గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటి పంటలు ఎండుతున్నాయి. దీంతో చేసేదేం లేక రైతులు పంట పొలాలను పశుగ్రాసంగా వాడుతున్నారు. మెట్ట ప్రాంతంగా ఉన్న చిగురుమామిడి మండలంలోని ఇందుర్తి. రేకొండ, చిన్నముల్కనూర్, ఓగులాపూర్, పీచుపల్లి గ్రామాలకు మాత్రమే సాగు నీరు వస్తోంది. ఎండలు ముదురడంతో భూగర్భ జలాలు అడుగంటి సాగునీరు అందడం లేదు. పొలాలకు దాదాపు రెండు నెలలు సాగునీరు అందాల్సి ఉన్నది. పెట్టుబడి పెట్టి పంట సాగు చేసిన రైతులు అప్పులు తీసుకొచ్చి బావుల్లో పూడికతీత పనులు చేపడుతున్నారు. మండలంలో చాలా గ్రామాలకు సాగునీరు అందడం లేదు. మామిడి తోటలకు ప్రైవేటు ట్యాంకర్ల నీరు అందిస్తున్నారు. సాగునీటి ప్రాజెక్టుల పనులు పూర్తి కాకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. గతంలో చేపట్టిన పనులు అర్ధంతరంగా నిలిచిపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.



ట్యాంకర్‌తో మామిడి తోటకు నీరు పెడుతున్న రైతు

అందని ఎస్సారెస్పీ నీరు

మంథని/మంథనిరూరల్ : అందని సాగునీరు, మండుతున్న ఎండలతో మంథని ప్రాంతంలో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వేసవికాలంలో ముదురుతున్న ఎండలకు తోడు సాగునీరు సైతం అందక ఇప్పటికే వందల ఎకరాల్లో వరి పొలాలు బీటలు వారాయి. యాసంగి సాగులో వివిధ గ్రామాల్లోని వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయే ప్రమాదం ముంచుకొస్తుంది. మరోతడికి సాగునీరు విడుదల చేయకపోతే అన్నదాతలు నిండా మునిగే ప్రమాదం ఉంది. మండలంలోని కాకర్లపల్లి, సూరయ్యపల్లి, ఎక్లాస్‌పూర్ వంటి ఎస్సారెస్పీ కెనాల్ చివరి ఆయకట్టు గ్రామాల్లో సాగునీరు అందక వందలాది ఎకరాల్లో వరి పంటలు బీటలువారుతున్నాయి. దాదాపు నెలరోజుల క్రితం ఎస్సారెస్పీ కెనాల్ ద్వారా సాగునీరు విడుదల చేసిన అధికారులు ఆతర్వాత ముఖం చాటేశారు. ఓవైపు ఎండలు ముదురుతుండటం, మరోవైపు కెనాల్‌లో సాగునీరు విడుదల చేయకపోవడం, బోర్లలో సైతం సరిపడా నీరు అందడం లేదు. మరో 15 రోజులు ఇలానే కొనసాగితే పంటలు పూర్తిగా ఎండిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటలు ఇప్పుడిప్పుడే పొట్టదశకు చేరుతున్నాయని ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఎస్సారెస్పీ కెనాల్ ద్వారా మరో తడికి నీరు అందించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.



కాకర్లపల్లి గ్రామ శివారులో బీటలువారుతున్న పంట పొలాలు

కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

వెల్గటూర్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పైడిపల్లి గ్రామంలో మల్లికార్జున స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం కొనసాగుతోంది. ఇందులో భాగంగా శనివారం స్వామి వారి సుప్రభాత సేవ, స్వస్తివచనం, ఆవాహిత మంటప దేవతాపూజలు నిర్వహించారు. వివిధ ఔషధ సుగంధాది స్నపనములు, బింబ శుద్ధి కార్యక్రమాలు అర్చకుల మంత్రోచ్ఛరణల మధ్య నిర్వహించారు. శ్రీదేవిసహిత రుద్ర హోమము నిర్వహించిన అనంతరం తీర్థప్రసాద వితరణ చేశారు. సాయంత్రం మూర్తి హోమము, మూల మంత్ర హోమము, కళాహోమము నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



పైడిపల్లిలో పూజలు చేస్తున్న భక్తులు



తాట్లవాయిలో ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

● **తాట్లవాయిలో..**

రాయికల్ (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాట్లవాయి గ్రామంలోగల సీతారామచంద్రస్వామి ఆలయంలో శనివారం విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా జరిగాయి. ఆలయంలో సీతారామ, లక్ష్మణ, హనుమాన్ విగ్రహాలతో పాటు సంతాన నాగప్రతిష్ఠ, ఏకశిలా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు రంగాచార్యులు, మురళి, మదన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అక్కపల్లి రాజరాజేశ్వర స్వామి ఆలయ హుండీ లెక్కింపు



దేవస్థానం హుండీ లెక్కింపు నిర్వహిస్తున్న భక్తులు

ధర్మపురి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్ర సమీపంలో గల అక్కపల్లి రాజరాజేశ్వరస్వామి దేవస్థానం హుండీ లెక్కింపు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా హుండీ ద్వారా రూ 1,98,319 ఆదాయం లభించింది. అలాగే 11 విదేశీ నోట్లు లభించాయి. ఈ సంవత్సరం కళ్యాణం టిక్కెట్ల ద్వారా 1,82,000, ఇతర టిక్కెట్ల ద్వారా 60,574, హుండీల ద్వారా 1,98,319 మొత్తం ఆదాయం రూ 4,40,893 లభించింది. గత ఏడాది కన్న రూ 19,206 అధికంగా ఆదాయం వచ్చింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఎండోమెంట్ జగిత్యాల ఇన్‌స్పెక్టర్ రాజమౌళి, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు బూస ప్రవీణ్‌కుమార్, జన్మంచి శ్రీనివాస్, ఆలయ మాజీ చైర్మన్ సీపతి సత్యనారాయణ, గడ్డం భాస్కర్‌రెడ్డి, సంగి ఆనంద్, గడ్డం బోజిరెడ్డి, గంగారెడ్డి, రాజయ్య, తిరుమల సేవా గ్రూప్ కరీంనగర్ సభ్యులు, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

ధర్మపురిలో భక్తుల రద్దీ

ధర్మపురి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. లక్ష్మీనరసింహస్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సుదూర ప్రాంతాల నుంచి క్షేత్రానికి భారీగా భక్తులు తరలి వచ్చారు. పవిత్ర గోదావరి నదిలో భక్తులు స్నానాలు ఆచరించారు. అనంతరం లక్ష్మీనరసింహస్వామిని భక్తులు దర్శనం చేసుకున్నారు. అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కల్యాణం జరిపించి పూజలు చేశారు. రామలింగేశ్వర స్వామి ఆలయం ఆవరణలో గల రావి చెట్టు ఆంజనేయ స్వామి చుట్టు భక్తులు ప్రదక్షిణాలు చేశారు.. యమ ధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తిశ్రద్ధలతో పూజలు జరిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, సంప త్‌కుమార్, రాజగోపాల్, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



స్వామి వారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

ఘనంగా పోచమ్మ బోనాలు



పోచమ్మ తల్లికి మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

కోనరావుపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం పల్లిమక్త గ్రామంలో శనివారం పోచమ్మ తల్లి, దుర్గాంబిక దేవతల బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటి నుంచి పోచమ్మ, దుర్గమ్మ తల్లులకు బోనాలతో డప్పుచప్పుల మధ్య వెళ్లి నైవేద్యం చెల్లించారు. కుటుంబసభ్యులు, పాడిపంటలు బాగుండాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు నాయిని ప్రభాకర్‌రెడ్డి, జిల్లా అనిల్, ఆనంద రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మల్లారెడ్డి, దుర్గారెడ్డి, లచ్చిరెడ్డి, బాపురెడ్డి, మాజీ సర్పంచ్ జిన్నా అనిల్, ఉప సర్పంచ్ కిషన్, భూమేష్ తదితరులు పాల్గొన్నారు.

అల్లీపూర్‌లో రాజరాజేశ్వర స్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

రాయికల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలంలోని అల్లీపూర్ గ్రామంలో రాజరాజేశ్వర స్వామి రథోత్సవం శనివారం కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా పురోహితులు అంగడి భువనేశ్వర్, అంగడి పరమేశ్వర్, గురులింగ మఠం వినయ్‌కుమార్, గురు లింగమఠం విక్రమ్‌ల మంత్రోచ్ఛరణల మధ్య రథోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు రథాన్ని లాగడానికి పోటీపడ్డారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అత్తినేని గంగారెడ్డి, మాజీ ఎంపీటీసీలు మోర విజయలక్ష్మివెంకటేష్, బాలె చంద్రశేఖర్, పీఏసీఎస్ చైర్మన్ రాజలింగం, జగిత్యాల రూరల్ సీఐ చిట్యాల భూమయ్య, నామని లక్ష్మీనర్సయ్య, సుమన్, శేఖర్, ప్రసాద్, శ్రీను, వేణురావు, రాజం పాల్గొన్నారు.

ఎక్స్‌గ్రేషియా విడుదలకు సీఎం ఆదేశం

- టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ మంద భీంరెడ్డి

జగిత్యాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్ ఎక్స్‌గ్రేషియా నిధుల విడుదలకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారని టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ కన్వీనర్ మంద భీం రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గల్ఫ్‌లో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున రాష్ట్ర ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తుందన్నారు. రాష్ట్రంలో 94 మంది బాధిత కుటుంబ సభ్యుల ఖాతాల్లో ఎక్స్‌గ్రేషియా సొమ్ము జమ చేయడానికి నిర్ణయం తీసుకోగా అందులో జగిత్యాల జిల్లాలో 31 మంది బాధిత కుటుంబ సభ్యులకు ఎక్స్‌గ్రేషియా అందనుందన్నారు. గల్ఫ్ మృతుల కుటుంబాలను ఆదుకునేలా రూ. 5 లక్షల పరిహారం నిధులు విడుదల చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, ఇతర ప్రజాప్రతినిధులకు భీంరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్సీ కౌంటింగ్ కేంద్రంలోకి నంబర్-1 గేట్ నుంచి అనుమతి

- ట్రాఫిక్ ఏసీపీ యాదగిరి స్వామి

కరీంనగర్ క్రైం, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు సందర్భంగా ఈ నెల 3న కౌంటింగ్ కేంద్రంలోకి వెళ్లే కౌంటింగ్ ఏజెంట్లు, క్లరికల్ సిబ్బంది, మీడియా ప్రతినిధులకు అంబేద్కర్ స్టేడియం గేట్ నంబర్-1 నుంచి ప్రవేశానికి అనుమతిస్తారని కరీంనగర్ ట్రాఫిక్ ఏసీపీ బి యాదగిరి స్వామి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్టేడియంలోకి ప్రవేశించిన వారు నిర్దేశించిన ప్రాంతంలో వాహనాలను పార్క్ చేసి గేట్‌నంబర్ -4 ద్వారా ఇండోర్ స్టేడియంలోకి అనుమతిస్తారని తెలిపారు. కౌంటింగ్ కేంద్రం వద్ద భద్రతా చర్యల్లో భాగంగా ట్రాఫిక్ నియంత్రణ కోసం నిబంధనలు పాటించాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణ, భద్రతాపరమైన చర్యలకు అందరూ సహకరించాలని కోరారు.

బాబ్లీ గేట్లు ఎత్తివేత

- గోదావరిలోకి 0.6 టీఎంసీల నీటి విడుదల

జగిత్యాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలో గల బాబ్లీ ప్రాజెక్టు గేట్లను శనివారం అధికారులు తెరిచారు. ప్రాజెక్టు నుంచి 0.6 టీఎంసీల నీటిని దిగువన గల గోదావరిలోకి విడుదల చేశారు. గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం తాగునీటి అవసరాల కోసం ఒక రోజు నీటిని విడుదల చేస్తున్నారు. మహారాష్ట్రలో గోదావరి నదిపై బాబ్లీ ప్రాజెక్టు నిర్మిస్తున్న సమయంలో ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు సుప్రీంకోర్టులో పిటీషన్లు వేయడంతో సంబంధిత ఉత్తర్వులు వచ్చాయి. దీని ప్రకారం ప్రతీ సంవత్సరం జూలై 1వ తేదీ నుంచి అక్టోబరు 29వ తేదీ వరకు బాబ్లీ నుంచి అధికారులు నీటిని విడుదల చేస్తుంటారు.

వేసవిలో ఎదురయ్యే నీటి ఎద్దడిని ఎదుర్కొవడానికి మార్చి 1న ఒక రోజు నీటిని విడుదల చేస్తారు. ఈ మేరకు బాబ్లీ ప్రాజెక్టు గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. ఉదయం 9.30 గంటలకు ఐదు బాబ్లీ ప్రాజెక్టు గేట్లను ఎత్తి నీటి విడుదలను ప్రారంభించారు. 0.6 టీఎంసీల నీరు విడుదల కాగానే తిరిగి గేట్లను మూసివేస్తారు. కార్యక్రమంలో అధికారులు వెంకటేశ్వర్లు, చక్రపాణి, ప్రశాంత్, కొత్త రవి, సచిన్, విన్యాస్, సుశాంత్, రిక్కి, పలువురు బాబ్లీ ప్రాజెక్టు, ఎస్సారెస్పీ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



బాబ్లీ ప్రాజెక్టు గేట్ల ద్వారా దిగువకు విడుదల అవుతున్న నీరు

ఉపాధిహామీ పథకంతో నిరుపేద కుటుంబాలకు ఆసరా

- చంద్రయ్య, ఏపీవో ఇల్లంతకుంట



ఆంధ్రజ్యోతి: ఉపాధి హామీ పథకం కింద ఈ ఆర్థిక సంవత్సరంలో ఎంతమంది కూలీలకు పనులు కల్పించారు?

ఏపీవో : మండలంలోని వివిధ గ్రామాలలో 5336 జాబ్ కార్డులలోని 7369 మంది కూలీలకు పనులు కల్పించాం.

ఆంధ్రజ్యోతి: ఇప్పటి వరకు ఎన్ని పనిదినాలు కల్పించారు. ఎంత మొత్తం వేతనాలు చెల్లించారు?

ఏపీవో : మండలంలోని అన్ని గ్రామాలలో 2,06,500 పనిదినాలు కల్పించాం. వేతనాల రూపంలో 4.47కోట్ల రూపాయలు కూలీలకు చెల్లించాం.

ఆంధ్రజ్యోతి: ఉపాధిహామీ పథకం కింద ఏయే పనులు చేపట్టారు?

ఏపీవో : పంటపొలాలకు రోడ్లు,ఫాంపాండ్లు, హార్టికల్చర్ పనులు, పంట కాలువలు, చెక్‌డ్యాంలు, వనమహోత్సవం, నర్సరీ పంట కాలువలు తదితర పనులు నడుస్తున్నాయి.

ఆంధ్రజ్యోతి: రైతులకు వ్యక్తిగతంగా లబ్ధి కోసం ఏయే పథకాలు అమలు చేస్తున్నారు?

ఏపీవో : పశువుల, గొర్లపాకలు, చిన్న కోళ్ళ ఫారమ్స్, అజోలాగడ్డి, వర్మి నాడెపు కంపోస్టు గుంతలు అమలుచేస్తున్నాం. ఈనెలాఖరు వరకు రూ.కోటి పనులు చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

- ఇల్లంతకుంట (ఆంధ్రజ్యోతి)

మద్దతు ధరకు శనగల కొనుగోలు

సిరిసిల్ల కలెక్టరేట్ మార్చి 1 (ఆంధ్రజ్యోతి) జిల్లాలో రైతులు పండించిన శనగల పంటను పూర్తిస్థాయిలో మద్దతు ధరకు కొనుగోలు చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. శనగల కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై శనివారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ సిరిసిల్ల జిల్లాలో మొత్తం 175 ఎకరాలలో శనగల సాగు జరిగిందని, మొత్తం 1347 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అన్నారు. బోయినపల్లి, చందుర్తి, కొనరావుపేట్, రుద్రంగి మండలాల్లో ప్యాక్స్ డీసీఎం కేంద్రాల ద్వారా శనగలు కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. శనగలు కొనుగోలు కేంద్రంలో అవసరమైన తేమ యంత్రాలు, టార్పాలిన్ కవర్లు, వెయింగ్ యంత్రాలు, గన్ని బ్యాగులు ఇతర సామగ్రి అందుబాటులో పెట్టుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల నుంచి శనగల తరలింపు కోసం వాహనాలను సన్నద్ధం చేయాలని పేర్కొన్నారు. శనగలు కొనుగోలు కేంద్రాలపై విస్తృత ప్రచారం కల్పించాలని, రైతులకు క్వింటాల్ చొప్పున ప్రభుత్వం మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేస్తుందని అవగాహన కల్పించాలని, తక్కువ ధరకు అమ్ముకోకుండా చూసుకోవాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల సమీపంలో శనగలు భద్రపరిచేందుకు అవసరమైన గోడౌన్లను గుర్తించాలని అన్నారు. వ్యవసాయ మార్కెట్ యార్డులు, ఎఫ్‌సీఐ, ప్రైవేట్ గోదాముల పరిశీలించి భద్రపరిచేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. శనగల కొనుగోలుకు సంబంధించి కనీసం మద్దతు ధర, పంట నాణ్యత పరిశీలన, తేమ శాతం, ఇతర నాణ్యత ప్రమాణాలపై అధికారులకు అవసరమైన శిక్షణ కార్యక్రమం సిబ్బందికి అందించాలని, జిల్లాలో శనగల కొనుగోలు కేంద్రం త్వరగా ఏర్పాటు చేసి రైతుల నుంచి కొనుగోలు ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన మేరకు హమాలీలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా మార్క్‌ఫెడ్ అధికారి హబీబ్, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రకాష్, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, డీసీవో రామకృష్ణ, డీఎం సివిల్ సప్లై రజిత డీసీఎస్‌వో వసంతలక్ష్మి సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

కోనరావుపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బీజేవైఎం మండల అధ్యక్షుడు చల్ల జితేందర్‌రెడ్డి అన్నారు. కోనరావుపేట మండల కేంద్రంలోని బీజేవైఎం నాయకులతో సమావేశం నిర్వహించి కొంతమందికి కొన్ని బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేవైఎం, బిజెపి కార్యకర్తలు అందరూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. సందర్భంగా బీజేవైఎం మండల ఉపాధ్యక్షుడిగా అన్నబోయిన అబిషేక్, ఊరెడి మధు యాదవ్, కార్యదర్శిగా పుల్కం ప్రశాంత్, కో కన్వీనర్‌గా మొగిలిపాలెం గణేష్ తదితరులను నియమించారు.

దుకాణాల సముదాయం వినియోగంలోకి వచ్చేదెప్పుడో?

గంభీరావుపేట, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మేజర్ గ్రామపంచాయతీ దుకాణాల సముదాయం వినియోగంలోకి రావడం లేదు. ప్రారంభమై ఏడాది దాటినా వినియోగంలోకి రాకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామ పంచాయితీ నిధులైన రూ. 19లక్షల 55 వేలతో 4 వ్యాపార దుకాణాలతో పాటు 2 మూత్రశాలను నిర్మించారు. గతేడాది జనవరిలో మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చేతుల మీదుగా ప్రారంభించారు. అదే ఏడాది మార్చిలో దుకాణాలను అద్దెకు ఇచ్చేందుకు టెండర్లు నిర్వహించి, లబ్ధిదారులను ఎంపిక చేశారు. వారి నుంచి 3 నెలల అడ్వాన్స్ తీసుకుని ఇప్పటికి దుకాణాలు అప్పగించలేదు. ఎంపీడీవో రాజేందర్‌ను వివరణ కోరగా, త్వరలో దుకాణాల సముదాయాన్ని వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

(5వ పేజీ తరువాయి)

రాజన్న సిరిసిల్ల జిల్లా రాష్ట్ర స్థాయిలో మొదటి సంవత్సరం 13వ స్థానంలో, రెండో సంవత్సరంలో 16వ స్థానంలో నిలిచింది. మొదటి సంవత్సరం జనరల్ ఇంటర్‌లో 57.79 శాతం, ఒకేషనల్‌లో 47.73 శాతం, రెండవ సంవత్సరంలో జనరల్ ఇంటర్‌లో 65.5 శాతం, ఒకేషనల్‌లో 63.1 శాతం ఉత్తీర్ణత సాధించారు. రెండు సంవత్సరాలు కలిపి 6,722 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, 4,130 మంది ఉత్తీర్ణులయ్యారు. ఒకేషనల్‌లో 902 మంది పరీక్షలకు హాజరుకాగా 498 మంది ఉత్తీర్ణులయ్యారు. 2019లో మొదటి సంవత్సరంలో 50శాతం, 2020లో 51శాతం, 2021లో 37శాతం, 2022లో 60శాతం, 2023లో 57 శాతం, 2024లో 57.79 సాధించారు. రెండవ సంవత్సరం ఫలితాల్లో 2019లో 61శాతం, 2020లో 63శాతం, 2021లో వంద శాతం, 2022లో 64 శాతం, 2023లో 69శాతం, 2023-2024లో 65.5శాతం ఉత్తీర్ణత సాధించారు. జిల్లాలో ఇంటర్ ఒకేషనల్‌లో 902మంది పరీక్షలకు విద్యార్థులు హాజరుకాగా 498 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 404 మంది ఫెయిలయ్యారు. మొదటి సంవత్సరంలో 463 మంది విద్యార్థులకు 221 మంది ఉత్తీర్ణులయ్యారు. 242 మంది ఫెయిలయ్యారు. 47.73 శాతం ఉత్తీర్ణత ఉంది. బాలురలో 272 మందికి 87 మంది, బాలికల్లో 191 మందికి 134 మంది ఉత్తీర్ణత సాధించారు. 47.73 శాతం ఉత్తీర్ణత సాధించారు. రెండవ సంవత్సరంలో 439 మంది విద్యార్థులకు 277 మంది ఉత్తీర్ణులయ్యారు. 63.1 శాతం ఉత్తీర్ణత ఉంది. బాలురలో 235 మందికి 117 మంది, బాలికల్లో 204 మందికి 160 మంది ఉత్తీర్ణులయ్యారు. ఈ సంవత్సరం రాష్ట్ర స్థాయిలో మెరుగైన ఫలితాలు సాధించాలనే సంకల్పంతో ఉన్నారు.

నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి..

- శ్రీనివాస్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి



జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తిచేశాం. విద్యార్థులు ఇంటర్మీడియట్ విద్యా మండలి ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలి. హాల్‌టికెట్‌లో ఫొటో, సబ్జెక్టులు, సంతకం వంటివి సరిగా ఉన్నాయా లేదా అనేది విద్యార్థులు సరిచూసుకోవాలి. ఏమైనా పొరపాట్లు, తప్పులు ఉంటే సంబంధిత కళాశాల ద్వారా దృష్టికి తీసుకరావాలి. జిల్లాలో 16 పరీక్ష కేంద్రాల ద్వారా 9,310 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

గంభీరావుపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం నిరసన వ్యక్తం చేశారు. పెండింగ్ స్కాలర్‌షిప్స్ ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కళ్యాణ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందన్నారు. ఇప్పటికైనా నిర్లక్ష్య వైఖరిని మార్చుకోవాలన్నారు. నిరసనలో ఎస్ఎఫ్ఐ నాయకులు అరుణ్, ఈశ్వర్, మనిస్వాంత్, అజయ్, నిఖిల్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయొద్దు

వీర్నపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులను హాల్ టికెట్లు అందించే విషయంలో ఆయా కళాశాలల యాజమాన్యాలు ఇబ్బందులకు గురి చేయొద్దని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు జాలపల్లి మనోజ్ కుమార్ డిమాండ్ చేశారు. వీర్నపల్లి మండల కేంద్రంలో ఎస్ఎఫ్ఐ నాయకులతో కలిసి గురువారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల5న ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ పరీక్షలకు విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రాబిన్సన్, నవీన్, ప్రవీణ్ పాల్గొన్నారు.

గల్ఫ్ కార్మికులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

ముస్తాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : గల్ఫ్ కార్మికుల కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉందని టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ అధ్యక్షుడు తోట ధర్మేందర్ పేర్కొన్నారు. ముస్తాబాద్‌లో శనివారం మాట్లాడుతూ గల్ఫ్‌లో మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు రూ.5లక్షలను సీఎం రేవంత్‌రెడ్డి విడుదల చేశారని పేర్కొన్నారు. రాష్ట్రంలో దాదాపు 113 మందికి ఎక్స్‌గ్రేషియా రూ.5లక్షల చొప్పును విడుదల చేశారని, 94 మందికి ఇప్పటికే వారి ఖాతాల్లో జమ అయిందన్నారు. గల్ఫ్‌మృతుల కుటుంబాలను ఆదుకునేందుకు రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు బి మహేశ్‌గౌడ్, అనిల్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు భూపతిరెడ్డి, విప్ ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మేడిపల్లి సత్యంలకు తోట ధర్మేందర్, జనగామ శ్రీనివాస్, పర్వ తిరుపతి, వందన మెస్ శ్రీకాంత్, నరేశ్‌రావులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులపై కేసు

ముస్తాబాద్, మార్చి 1(ఆంధ్రజ్యోతి): ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన ముగ్గురు విద్యార్థులపై కేసు నమోదు అయినట్లు ఎస్సై సీహెచ్ గణేష్ శనివారం తెలిపారు. మండలంలోని ఓ పాఠశాలకు చెందిన విద్యార్థినులు దారిలో నడుస్తూ వెళుతుండగా ముస్తాబాద్‌లో పదో తరగతి చదువుతున్న ముగ్గురు విద్యార్థులు కామెంట్ చేయడంతో 100 డయల్‌కు కాల్ చేశారు. దీంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ముగిసిన కరాటే శిక్షణ తరగతులు

గంభీరావుపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లింగన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సెల్ఫ్ డిఫెన్స్ కోర్సులో భాగంగా జరుగుతున్న కరాటే శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఎంఈవో గంగారాం కరాటేలో ప్రతిభ చూపిన విద్యార్థినులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరాటే ట్రైనర్ బుచ్చిబాబు, పాఠశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

'అక్రమ కేసులపై లోకాయుక్తకు ఫిర్యాదు'

సిరిసిల్ల టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): తనపై పెట్టిన అక్రమ కేసులపై లోకాయుక్తను ఆశ్రయించినట్లు ఏఐఎఫ్టీయూ(న్యూ) రాష్ట్ర కార్యవర్గసభ్యుడు సోమిశెట్టి దశరథం అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణం శాంతినగర్‌లోని ఏఐఎఫ్టీయూ (న్యూ) కార్యాలయంలో విలేకరుల సమావేశంలో దశరథం మాట్లాడారు. సిరిసిల్ల శాంతినగర్‌లోని సర్వేనంబర్ 40లోని నూట ఎనభై ఒకటిన్నర చదరపు గజాల ప్లాటును అబ్బగోని మల్లయ్య వారసులైన బండి రామకృష్ణ, బండి హరికృష్ణ వద్ద నుంచి 2024 అక్టోబరు 9న సేల్‌డీడ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకున్నానన్నారు. రామకృష్ణ, హరికృష్ణ స్థలాన్ని చూపించి హద్దుల్లో ఖనిలు పెట్టడంతో గాజుల గణేష్ ఖనిలు తొలగించారని, దీనిపై సిరిసిల్ల పట్టణ సీఐకి ఫిర్యాదు చేయగా పట్టించుకోలేదని, తనకు జరిగిన అన్యాయంపై హైదరాబాద్‌లోని లోకాయుక్తను ఆశ్రయించానని తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ రైతు కూలీ సంఘం నాయకులు ఎల్లన్న శ్రీనివాస్, పాండు, లచ్చన్న పాల్గొన్నారు.

రైతులు సంఘటితంగా ఉంటేనే పురోభివృద్ధి

ఇల్లంతకుంట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : రైతులు సంఘటితంగా ఉంటేనే సంఘం పురోభివృద్ధి చెందుతుందని సహకారశాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోన గాలిపెల్లి గ్రామంలో వేణుగోపాల స్వామి సీడ్స్ ఫార్మర్ సొసైటీ సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. ఈసందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రైతుల సహకారంతో పురోభివృద్ధి చెందుతున్న సంఘ సభ్యులు ఎన్నికలు జరుపాలని కోరారని తెలిపారు. సభ్యుల వినతి మేరకు ప్రస్తుతం అడహక్ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అడహక్ కమిటీ సభ్యులు ఓటర్ జాబితాను రూపొందించి, నెలరోజుల్లో ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. అడహక్ కమిటీ అధ్యక్షుడిగా జంగారి కిష్టారెడ్డి, సభ్యులుగా సింగిరెడ్డి రమణారెడ్డి, పల్లె మధుసూదన్‌రెడ్డి, బద్దం అనంతరెడ్డి, బద్దం సుభాష్‌చంద్రారెడ్డిలు ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో సహకారశాఖ అధికారులు రాములు, సెస్ డైరెక్టర్ మల్లుగారి రవీందర్‌రెడ్డి, మాజీ ఛైర్మన్ పుల్లుగారి చంద్రారెడ్డి, సీఈవో నంది మల్లేశంతో పాటు సభ్యులు పాల్గొన్నారు.

ఎండిపోతున్న పంటలకు సాగు నీరందించాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గోపి

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : రిజర్వాయర్‌ల నుంచి కాలువలకు నీటిని విడుదల చేసి ఎండిపోతున్న పంటలను కాపాడాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి డిమాండ్ చేశారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో శనివారం రైతులతో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు వినతి పత్రాన్ని అందించారు. మల్కపేట రిజర్వాయర్ నుంచి సింగ సముద్రంలోకి నీళ్ల పంపించాలంటూ వినతి పత్రంలో కోరారు. అందించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. వ్యవసాయం కోసం నీటి అందించేందుకు నిర్మించిన మల్లపేట రిజర్వాయర్ నుంచి ఎల్లారెడ్డిపేట మండలంలోని సింగ సముద్రం చెరువులోకి నీటిని కాలువల ద్వారా పంపిస్తే సుమారు 700 ఎకరాలు పంటలను ఎండిపోకుండా కాపాడుకోవచ్చునని అన్నారు. దీంతో స్పందించిన కలెక్టర్ సందీప్ కుమార్‌ఝా సంబంధిత అధికారులతో మాట్లాడి మూడు రోజుల్లో నీటిని విడుదల చేయిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ కో-కన్వీనర్ అడెపు రవీందర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రాగుల రాజిరెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మ్యానరాంప్రసాద్, ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షుడు పోన్నాల తిరుపతిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, రైతులు ఉడుగులు యాదగిరి, కృష్ణహరి, నాంపెల్లి, రాములు, శెట్టిపల్లి సంతోష్, రాణవేణి దేవరాజు, మాదిరెడ్డిమోహన్‌రెడ్డి, యాదగిరి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఎదుట మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గోపి

ఆర్టీసీ డిపో ఎదుట అద్దె బస్ డ్రైవర్ల ధర్నా


సిరిసిల్ల ఆర్టీసీ బస్ డిపో వద్ద ధర్నా చేస్తున్న డ్రైవర్లు

సిరిసిల్ల టౌన్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ కాంట్రాక్ట్ డ్రైవర్ల ఉద్యోగాల భర్తీలో తమకు మొదటి ప్రాధాన్యతను ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శనివారం సిరిసిల్ల టీజీఆర్టీసీ డిపో ఎదుట హైర్ బస్సు డ్రైవర్లు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా టీజీఆర్టీసీ హైర్ బస్సు డ్రైవర్స్ అసోసియేషన్ సిరిసిల్ల డిపో అధ్యక్షుడు గొల్లపల్లి రాజు మాట్లాడారు. సిరిసిల్ల ఆర్టీసీ డిపోలో హైర్ బస్సు డ్రైవర్లుగా దాదాపు 10 సంవత్సరాలుగా పని చేస్తున్నామన్నారు. ఆర్టీసీలో కాంట్రాక్ట్ బేసిక్‌లో డ్రైవర్ల నియామకాలకు దరఖాస్తు చేసుకోవడానికి హైర్ బస్సు డ్రైవర్లు శుక్రవారం కరీంనగర్‌లోని ఆర్ఎం కార్యాలయానికి వెళ్లామని, సిరిసిల్ల డిపో హైర్ బస్సు డ్రైవర్లకు ఉద్యోగాలు ఇచ్చే అవకాశం లేదని, కొత్తవారికే మాత్రమే అవకాశం ఉందని అధికారులు దరఖాస్తులు స్వీకరించడానికి నిరాకరించారని ఆవేదన వ్యక్తం చేశారు. హైర్ బస్సులు నడిపే డ్రైవర్లకు ఎందుకు ఆర్టీసీ డ్రైవర్లుగా అవకాశం ఇవ్వరని ప్రశ్నించారు. ఏ కారణంతో హైర్ బస్సు డ్రైవర్లను తీసుకోవడం లేదో లిఖిత పూర్వకంగా రాసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనుభవం అర్హత ఉన్న హైర్ బస్సు డ్రైవర్లకు అవకాశం ఇవ్వకుండా అనుభవం లేని డ్రైవర్లను తీసుకోవడంపై పలు అనుమానాలను తావిస్తోందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దీనిపై స్పందించి అనుభవం అర్హత ఉన్న హైర్ బస్సు డ్రైవర్లకు ఆర్టీసీ కాంట్రాక్ట్ డ్రైవర్ల ఎంపికలో మొదటి ప్రాధాన్యతను ఇస్తూ ఉద్యోగ అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సిరిసిల్ల డిపో ఉపాధ్యక్షుడు గొర్రె రమేష్, ప్రధానకార్యదర్శి భూక్య శ్రీను, కోశాధికారి పిట్ల నరేష్, నాయకులు లింగరావు, నరేందర్, శ్రీకాంత్, రత్నాకర్, వెంకటస్వామి, భాస్కర్, బాలకృష్ణ, జగన్ హైర్ బస్సు డ్రైవర్లు పాల్గొన్నారు.

మానేరు నీటిని రైతులకు అందించాలి

ముస్తాబాద్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ఎగువ మానేరు ఆయకట్టు నీటిని ముస్తాబాద్ మండల రైతులకు అందించాలని బీఆర్ఎస్ యువజన కార్యదర్శి శీలం స్వామి పేర్కొన్నారు. ముస్తాబాద్‌లో ఎగువమానేరు పారకం రైతులకు సాగునీరు రావడం లేదని దీంతో పంటలు ఎండిపోతున్నాయన్నారు. ముస్తాబాద్‌లోని 18 నంబర్ గేట్ వరకే నీటిని విడుదల చేస్తున్నారని కనీసం తెర్లుమద్దికి శనివారం, ఆదివారాల్లో విడుదల చేసిన నీటితో ముస్తాబాద్ రైతులకు అందించాలన్నారు. కెనాల్ పారకంపై పర్యవేక్షణ కొరవడి పొలాలకు సాగునీరు సక్రమంగా అందడం లేదన్నారు. అధికారుల నిర్లక్ష్యం చేయకుండా పర్యవేక్షకులకు రాత్రి సమయాల్లో గేట్ల దగ్గర ఉంచి నీరు చివరిదాకా వచ్చేలా చూడాలన్నారు. ముస్తాబాద్ రైతులపై వివక్ష చూపొద్దన్నారు. నీటిని విడుదల చేయాలని స్థానిక డీటీకి వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనేహర్, రైతుల మిరుదొడ్డి బాలరాజు, అక్కపెల్లి నారాయణ, సుంచు దేవయ్య శ్రీను, వెంకటి, బాలయ్య, పర్శరాములు, ఎల్లం, మల్లేశం, జహంగీర్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

సిరిసిల్ల రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రజాప్రతినిధులు రాజకీయాలను దూరం పెట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని అమృత్‌లాల్‌శుక్లా కార్మిక భవనంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ప్రజలు పలు సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీ హామీలను పూర్తిస్థాయిలో అమలుచేయాలన్నారు. బీఆర్ఎస్ నాయకులు ఆక్రమించుకున్న ప్రభుత్వ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో పట్టణ కార్యదర్శి అన్నల్‌దాస్ జిల్లా కమిటీ సభ్యులు సూరం పద్మ, నక్క దేవదాస్, సిరిమల్ల సత్యం, ఒగ్గు గణేష్, బెజుగం సురేష్, బింగి సంపత్, సందుపట్ల పోచమల్లు తదితరులు పాల్గొన్నారు.

మాదిగ అమరవీరుల ఆశయ సాధనకు కృషి

- ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఖానపురం లక్ష్మణ్ మాదిగ


ఎల్లారెడ్డిపేటలో నివాళులర్పిస్తున్న ఖానపురం లక్ష్మణ్, నాయకులు


కోనరావుపేటలో నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : మాదిగ అమరవీరుల ఆశయాల సాధనకు కృషి చేస్తామని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఖానపురం లక్ష్మణ్ మాదిగ అన్నారు. మండల కేంద్రంలో మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి శనివారం అమరవీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సోమారపు శరవింద్, ప్రధాన కార్యదర్శి నర్సయ్య, రాజన్నపేట మాజీ సర్పంచ్ ముక్క శంకర్, మాదిగ ఉద్యోగ సంఘాల అధ్యక్షులు ఎరుపుల దేవయ్య, మాజీ ఎంపీటీసీ మధు, పాల్గొన్నారు.

● వీర్నపల్లి : మండల కేంద్రంలో మాదిగ అమరవీరుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గద్దెరాశి భగవంతం, నాయకులు రాజు, చంద్రయ్య, రాజు, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : మండలకేంద్రంలో నివాళులు అర్పించారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మంద రాజు మాదిగ, గుండ్రెడ్డి రాజు, జిల్లా కోకన్వీనర్ సావనపెల్లి రాకేష్, పసుల వెంకటి, దేవదాస్, మాంకాళి బాబు, మచ్చ రాజేశం, శంకర్, కాసుపాక సురేష్, రాములు, ప్రేమ్, శ్రీనివాస్, సింహాద్రి, బాబు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

● చందుర్తి : మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు శంకరయ్య ఆధ్వర్యంలో మాదిగ అమరవీరుల చిత్రపటాలకు నివాళులు అర్పించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు అవునూరి రాజు, లింగంపల్లి బాబు కుమ్మరి లక్ష్మణ్, నేరెళ్ల దేవయ్య, నేరెళ్ల సురేష్,నర్సయ్య,రాజు, లచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

● రుద్రంగి : మండల కేంద్రంలో మాదిగ అమరవీరులకు ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు దయ్యాల నారాయణ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు.ఉపాధ్యక్షుడు సింగరపు గంగరాజాం, గౌరవ అధ్యక్షుడు దయ్యాల పెద్దులు, చెప్పాల సంజీవ్, శ్రీనివాస్, సింగారపు రెడ్డి, అక్కనిపెల్లి శ్రీనివాస్, రాగుట్ల నారాయణ, సింగారపు బాబు, ఒద్యారాపు ఆనంద్, రోమల అశోక్, దయ్యాల ప్రసాద్, సింగారపు గంగారం,ఒద్యారపు జలంధర్ పాల్గొన్నారు.

● కోనరావుపేట : మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో మాదిగ అమరవీరుల సంస్మరణ సభ శనివారం నిర్వహించారు. కోనరావుపేట మార్కెట్ కమిటీ ఛైర్మన్ కచ్చ కాయల ఎల్లయ్య, మాజీ సర్పంచ్ బాల్‌రెడ్డి, దేవయ్య, స్వామి, కొలనూరు సింగిల్ విండో ఛైర్మన్ కాశవేణి మహేష్, సంజీవ్, వంగాల పెద్ద శ్రీనివాస్, ఉప్పుల అంజయ్య, ఉద్యారపు శంకర్, రాజయ్య, సుంకరి రాజు, మహేష్, రాజశేఖర్, బిక్షపతి, దేవదాసు పాల్గొన్నారు.

● వేములవాడ రూరల్ : వేములవాడ రూరల్ మండలం పోశెట్టిపల్లిలో మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు గుండా థామస్ మాదిగ, పూడూరు పోచయ్య, ల్యాగల వరప్రసాద్,ఇషాక్, శంకర్, భూమయ్య, రత్నం, కాశీరాం, దేవయ్య, సంతోష్, ధనుష్, జీవన్, పోశయ్య, రాజు, అజయ్, యాకోబు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సన్మానం

గంభీరావుపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట ముదిరాజ్ సంఘ భవనంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపీకి శనివారం సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముదిరాజ్ సంఘాన్ని గుర్తించి బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా రెడ్డబోయిన గోపీ ముదిరాజ్‌ను నియమించడంపై సంఘ సభ్యులు ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సాగునీటి కాలువ పరిశీలన

ఎల్లారెడ్డిపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ గ్రామంలోని జక్కుల చెరువు నుంచి పంట పొలాలకు వెళ్లే పారకం నీటి కాలువను ఇరిగేషన్ ఏఈ భాస్కర్‌రెడ్డి శనివారం పరిశీలించారు. నీటి పారకం కాలువను బొప్పాపూర్‌కు చెందిన రైతు బాలయ్య అతని వ్యవసాయ బావిలోకి మళ్లించి రెండు 7.5 హెచ్‌పీ మోటార్లతో పారకం లేని భూములకు నీటిని అక్రమంగా వాడుకుంటున్నాడని, ప్రశ్నిస్తే దురుసుగా ప్రవర్తిస్తున్నాడని గొల్లపల్లి గ్రామ రైతులు ఏఈకి ఫిర్యాదు చేశారు. కాలువను అక్రమంగా బావిలోకి మళ్లించడంతో గొల్లపల్లి గ్రామంలో నీరు అందక పొలాలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతుందని మండిపడ్డారు. వెంటనే ఏఈ స్పందించి బావిలోకి పారకం నీరు వెళ్లకుండా మూసివేయించారు. మరోసారి అక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అంగన్‌వాడీ ఉద్యోగుల కుటుంబాలను ఆదుకోవాలి

చందుర్తి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు, అనారోగ్యంతో మృతిచెందిన అంగన్‌వాడీ ఉద్యోగులను ప్రభుత్వం ఆదుకోవాలని అంగన్‌వాడీ టీచర్స్ హెల్పర్ యూనియన్ జిల్లా ఆధ్యక్షురాలు ఎదురుగట్ల మమత, మండల అధ్యక్షురాలు ఆయేషా నస్రీన్ అన్నారు. చందుర్తి మండలం తిమ్మాపూర్‌లో అంగన్‌వాడీ ఆయా మూడపల్లి దేవమ్మ 5రోజులుగా అస్వస్థకు గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందగా, బాధిత కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో చాలా మంది అంగన్‌వాడీ ఉద్యోగులు చాలీచాలని జీతాలతో జీవితాలను నెట్టుకోస్తున్నారన్నారు. ఆసుపత్రికి వెళ్లడానికి డబ్బులు లేక, అంగన్‌వాడీలకు హెల్త్‌కార్డులు లేవని డ్యూటీలో ఉండగా చనిపోయిన వాళ్ళకి ఎక్స్‌గ్రేషియా రావడం లేదన్నారు. 65సంవత్సరాలు నిండిన టీచర్, ఆయాలకి రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెన్షన్ కూడా రావడం లేదన్నారు. ఎక్స్‌గ్రేషియా అందజేస్తూ, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కూడా త్వరగా ఇప్పించి టీచర్ ఆయాలకు న్యాయం చేయాలన్నారు. మండలంలోని అంగన్‌వాడీ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రభుత్వం తరపున ఆర్థిక సాయం అందజేత

రాష్ట్ర ప్రభుత్వం మృతిచెందిన ఆయా దహన సంస్కారాలకు పదివేల రూపాయలను మంజూరు చేయగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ బాధిత కుటుంబానికి అందజేశారు. మండల అంగన్‌వాడీ ఉపాధ్యాయులు యూనియన్ ఆధ్వర్యంలో రూ.5వేల ఆర్థిక సహాయం అందజేశారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఎల్లారెడ్డిపేట, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలతో గత నెల 22న పురుగుల మందు తాగిన మండలంలోని సింగారం గ్రామానికి చెందిన సంపంగి స్వామి(25) హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. స్వామి గ్రామపంచాయతీ ట్రాక్టరు డ్రైవర్‌గా పని చేస్తున్నాడని గ్రామస్థులు తెలిపారు. మృతుడికి తల్లిదండ్రులు లక్ష్మి, రాజు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.